




# పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక








కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 సోమవారం 12-10-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వేల : 04


## టీమిండియా ఆలౌట్.. వెస్టిండీస్ టార్గెట్ 224 పరుగులు

ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం వేదికగా వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడో టీ20 మ్యాచ్‌లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది.ప్రత్యర్థి వెస్టిండీస్ ముందుకు 224 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ హాఫ్ సెంచరీతో చెలరేగగా, మిగతా బ్యాటర్లు వేగంగా పరుగులు సాధించడంతో భారత్ భారీ స్కోరును నమోదు చేయగలిగింది.




**అభిషేక్ శర్మ హాఫ్ సెంచరీ:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ అభిషేక్ శర్మ (69) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో బలమైన పునాది వేశాడు. విండీస్ బౌలర్లను నలువైపులా బాదుతూ వేగవంతమైన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో అత్యంత వేగంగా 2000 పరుగులని కూడా పూర్తి చేసుకున్నాడు అభిషేక్, మరోవైపు, మిడిల్ ఆర్డర్లో ఇషాన్ కిషన్ (37), తిలక్ వర్మ (28), ఆల్ రౌండర్లు నితీష్ కుమార్ రెడ్డి (21), అక్షర్ పటేల్ (20) లు వేగంగా పరుగులు సాధించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. అయితే, సంజు శాంసన్ (3), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (1), నమన్ ధీర్ (10)లు తక్కువ పరుగులకే అవుటై నిరాశపరిచారు. - మిగతా 2 లో

## ధరల పెరుగుదలకు మేం కారణం కాదు: ట్రంప్ ఆరోపణలను తిప్పికొట్టిన జెలెన్స్కీ

- పశ్చిమాసియా యుద్ధం, హర్మూజ్ జలసంధి దిగ్బంధనమే కారణమని స్పష్టం చేసిన జెలెన్స్కీ
- రష్యా దాడులు ఆపితే ఇంధన కేంద్రాలపై దాడులు నిలిపివేస్తామంటూ ప్రతిపాదన
- ట్రంప్ ఏకపక్షంగా ప్రకటించిన 'ఎనర్జీ కాల్పుల విరమణ'పై ఆశ్చర్యం వ్యక్తం చేసిన జెలెన్స్కీ
- 60 రోజుల కాల్పుల విరమణ ఇస్తే ఎన్నికలు నిర్వహిస్తామని మరో ఆఫర్



అమెరికాలో ఇంధన ధరల పెరుగుదలకు ఉక్రెయినే కారణమంటూ వస్తున్న ఆరోపణలను ఆ దేశ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ - మిగతా 2 లో

## చెన్నై ఎయిర్‌పోర్టులో ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికిన సీఎం విజయ్

చెన్నై: తమిళనాడు పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి చెన్నై విమానాశ్రయంలో సీఎం సి. జోసెఫ్ విజయ్ ఘన స్వాగతం పలికారు.



ఈ రోజు ఉదయం 11 గంటలకు ప్రత్యేక విమానంలో చెన్నై చేరుకున్న ప్రధాని మోదీకి గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, సీఎం విజయ్‌తో పాటు అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి, బీజేపీ నేత నైనార్ నాగేంద్రన్ స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి పోరూర్ మెట్రో స్టేషన్ వరకు ప్రధాని రోడ్ షో నిర్వహించారు. అనంతరం సీఎం విజయ్ తో కలిసి పూనమల్లి - వడపళని మధ్య నూతనంగా నిర్మించిన చెన్నై మెట్రో ఫేజ్-2 ను ప్రారంభించి, ఇద్దరూ కలిసి మెట్రోలో ప్రయాణించారు. ఈ ప్రాజెక్టుల విలువ దాదాపు రూ.13,000 కోట్లు. - మిగతా 2 లో

## ఇండియా కూటమి మహాధర్నాలో పాల్గొనడానికి ఢిల్లీకి వెళుతున్న తెలంగాణ కాంగ్రెస్ నేతలు



ఢిల్లీకి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , మంత్రులు పొన్నం ప్రభాకర్ అడ్లూరు లక్ష్మణ్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులతో కలిసి పయనం ! ఓటరు సవరణ ప్రక్రియ లో జరుగుతున్న అక్రమాలు ,జజుజ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రేపు ఇండియా కూటమి మహాధర్నా లో పాల్గొననున్న తెలంగాణ కాంగ్రెస్ నేతల బృందం!

## క్రిప్టో కరెన్సీ పేరుతో భారీ మోసం.. ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్!



ఐటీసీ గ్లోబల్ పేరుతో పెట్టుబడుల మోసం.. రూ.10 కోట్లకు పైగా వసూళ్లు చేసినట్లు అనుమానం.

## హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే

# రేవంత్ సంచలన ఆరోపణ

- గోవాలో రేవంత్ రెడ్డి పర్యటన
- సీఎం ప్రమోద్ సావంత్ లక్ష్యంగా ఆరోపణలు
- ఆయన ప్రమోద్ సావంత్ కాదు, ప్రాపర్టీ సావంత్ అని విమర్శ
- హైదరాబాద్‌లో పట్టుబడిన డ్రగ్స్‌కు మూలం గోవానేనని ఆరోపణ
- భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని మండిపాటు
- గోవాను కాపాడుకోవడానికి కాంగ్రెస్ అధికారంలోకి రావాలని పిలుపు




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గోవాలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గోవాను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చారని, ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కాదు, భూములు కబ్జా చేస్తున్న 'ప్రాపర్టీ సావంత్' అని ఆయన పదునైన విమర్శలు చేశారు. గోవాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'గోయ్ రాఖోన్న్' (సేవ్ గోవా) యాత్రలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీ పాలనలో గోవా యువత నిరుద్యోగంతో నిరాశకు లోనవుతున్నారని, ప్రమాదకరమైన మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌లో పట్టుబడుతున్న డ్రగ్స్‌కు మూలాలు గోవాలోనే ఉన్నాయి. అక్కడి నుంచే

## 'ఓట్ల చోరీ'ని ఆపాలి



- రేపు సుప్రీంకోర్టు వరకు 'ఇండియా మార్చ్'భయపడకుండా రండి
- ఎన్నికల ప్రక్రియపై సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేయనున్న విపక్షాలు
- సోమవారం సుప్రీంకోర్టుకు మార్చ్ నిర్వహించాలని రాహుల్ గాంధీ పిలుపు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- సీజేఐ అపాయింట్‌మెంట్ కోరుతూ లేఖ రాసినట్లు తెలిపిన ఖర్గే
- శాంతియుత నిరసనకారులపై దాడులు జరిగాయని రాహుల్ ఆరోపణ

ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, 'ఓట్ల చోరీ' జరుగుతోందని ఆరోపిస్తున్న - మిగతా 2 లో

## విజయవాడ ఉత్సవ్ 2.0: ఏపీ ప్రభుత్వానికి ప్రధాని మోదీ ప్రశంసల లేఖ

- విజయవాడ ఉత్సవ్ 2.0 నిర్వహణపై ప్రధాని మోదీ హర్షం
- ఏపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి అభినందనలు తెలుపుతూ లేఖ
- దసరా ఉత్సవాలతో పాటు అక్టోబర్ 11 నుంచి వేడుకలు
- ఈ ఉత్సవాలు పర్యాటకానికి కొత్త ఊపునిస్తాయని మోదీ ప్రశంస
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'విజయవాడ ఉత్సవ్ 2.0' కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ తన అభినందనలు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఆయన ఒక లేఖ రాశారు. విజయవాడలో ఈ ఉత్సవాలను నిర్వహించడం పట్ల ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక జీవనంలో విజయవాడకు ఒక ప్రత్యేక స్థానం ఉందని ప్రధాని తన లేఖలో పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు కల్పిస్తాయని, పర్యాటక రంగానికి తాజా ఉత్తేజాన్ని ఇస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ ప్రజలకు, వారి సాంస్కృతిక వారసత్వానికి మధ్య ఉన్న బంధాన్ని

## ఎమర్జెన్సీ గురించి రాహుల్ ముందు నేర్చుకోవాలి



- ఇప్పుడున్నది ఎమర్జెన్సీ కాదు, ముందు జాగ్రత్త చర్యలేనన్న కిషన్ రెడ్డి
- ప్రజాస్వామ్యంపై పాఠాలు చెప్పే అర్హత కాంగ్రెస్‌కు లేదని విమర్శ
- తెలంగాణకు వచ్చి చూడాలంటూ రాహుల్ గాంధీకి సవాల్
- బీజేపీ కార్యక్రమాలను రేవంత్ సర్కార్ అడ్డుకుంటోందని ఆరోపణ
- దేశంలో అశాంతికి కొన్ని శక్తులు కుట్ర పన్నుతున్నాయని వ్యాఖ్య

నిజమైన ఎమర్జెన్సీ అంటే ఏమిటో, - మిగతా 2 లో

## పౌరులే లక్ష్యంగా దాడులు ఆమోదయోగ్యం కాదు




- రియాద్ ఎయిర్‌పోర్ట్ ఘటనపై భారత్ ఘాటు స్పందన
- రియాద్ ఎయిర్‌పోర్ట్‌పై క్షిపణి దాడిని తీవ్రంగా ఖండించిన భారత్
- ఈ దాడిలో 12 మంది మృతి.. 300 మందికి పైగా గాయాలు
- పౌరుల లక్ష్యంగా దాడులు చేయడం ఆమోదయోగ్యం కాదన్న భారత విదేశాంగ శాఖ
- సౌదీ ప్రభుత్వానికి, ప్రజలకు సంఘీభావం - మిగతా 2 లో

# పత్రికా స్వేచ్ఛపై దాడి

- జర్నలిస్టులపై విరుచుకుపడిన పోలీసులు
- ఢిల్లీ నిరసనల ఘటనలపై ?పలు జర్నలిస్టు సంఘాల ఆగ్రహం
- ప్రెస్ కార్డులు చూపించినా అదుపులోకి తీసుకున్నారు
- ఫోన్లు స్వాధీనం చేసుకున్నారని ఆరోపణలు
- మహిళా జర్నలిస్టుల లైంగికదాడి ఆరోపణలపైనా చర్యలు తీసుకోవాలి: ఎడిటర్స్ గిల్డ్ డిమాండ్




దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలను కవర్ చేస్తున్న జర్నలిస్టులపై పోలీసులు, భద్రతా బలగాలు వ్యవహరించిన తీరుపై పలు జర్నలిస్టు సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ప్రెస్ కార్డులు చూపించినప్పటికీ పలువురు విలేకరులను అదుపులోకి తీసుకోవడం, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుల ఫోన్లను స్వాధీనం చేసుకోవడం, వారిపై దౌర్జన్యానికి పాల్పడినట్టు ఆరోపణలు

## సీఈసీపై పోరు.. వాయిదా పడిన రాహుల్ గాంధీ గోవా పర్యటన!

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్షాల నిరసనలు
- ఢిల్లీ ఆందోళనల్లో పాల్గొనాలని రాహుల్ గాంధీ నిర్ణయం
- ప్రస్తుతానికి వాయిదా పడిన గోవా పర్యటన
- రాహుల్ పర్యటన వాయిదాపై గోవా కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు




కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన గోవా పర్యటనను వాయిదా వేసుకునే అవకాశం ఉంది. కేంద్ర ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్షాలు తలపెట్టిన ఆందోళనల్లో

## క్రిప్టో కరెన్సీ పేరుతో భారీ మోసం.. ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్!

మొదటిపేజీ తరువాయి – రెండేళ్లలో పెట్టుబడులు రెట్టింపు అవుతాయని, అధిక లాభాలు వస్తాయని నమ్మించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సుమారు 500 మంది బాధితులను మోసం చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. రూ.1,000 నుంచి రూ.3 లక్షల వరకు పెట్టుబడి ప్యాకేజీలు ప్రవేశపెట్టి, కొత్త సభ్యులను చేర్చిన వారికి 25 శాతం వరకు కమీషన్ ఇస్తామని ఆశ చూపినట్లు గుర్తించారు. జూమ్ మీటింగ్‌లు, హోటళ్లలో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను ఆకర్షించారు. ఆదిలాబాద్‌లోనూ పలువురు బాధితులు.. ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితులు లక్షల రూపాయలు పెట్టుబడిగా చెల్లించినట్లు ఫిర్యాదులు అందాయి. ప్రధాన ఫిర్యాదులో జువ్వక నర్సింలు రూ.7.50 లక్షలు పెట్టుబడి పెట్టినట్లు పేర్కొన్నారు. ఇతర బాధితుల ఫిర్యాదులు తీసుకొని దర్యాప్తు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.

## టీమిండియా ఆలౌట్.. వెస్టిండీస్ టార్గెట్ 224 పరుగులు

మొదటిపేజీ తరువాయి – **చివరి ఓవర్లో ప్రిన్స్ యాదవ్ బాదుడు:** చివర్లో పేసర్ ప్రిన్స్ యాదవ్ (13) బౌండరీ (4,0, 4, 4, 1ఎ, ఔ)లతో మెరిశాడు. చివరి ఓవర్లో వరుస బౌండరీలతో చెలరేగి జట్టు స్కోరును 223 పరుగులు చేయడంలో కీలక పాత్ర పోషించాడు.

**కట్టడి చేసిన కరేబియన్ బౌలర్లు:** ఒకానొక దశలో భారత్ భారీ స్కోరు సాధించేలా కనిపించినా.. వెస్టిండీస్ బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ కట్టడి చేశారు. విండీస్ బౌలర్లలో రోస్టన్ చేజ్, స్ప్రింగర్, షమర్ జోసెఫ్‌లు రెండేసి వికెట్లు పడగొట్టగా.. కీమో పాల్, గుడాకేష్ మోటీలకు తలో వికెట్ దక్కింది. ఇప్పటికే 1-1తో సమంగా ఉన్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో లీడ్ సాధించాలంటే విండీస్ 224 పరుగులు చేయాల్సి ఉంది.

## హైదరాబాద్ డ్రగ్స్‌కు మూలం గోవానే: రేవంత్ సంచలన ఆరోపణ

మొదటిపేజీ తరువాయి – దేశంలోని ప్రధాన నగరాలకు మాదకద్రవ్యాలు అక్రమంగా రవాణా అవుతున్నాయి" అని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. దిశా డైలీ కథనం ప్రకారం, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లతో డ్రగ్స్ నెట్‌వర్క్‌లను కూల్చివేశామని, కానీ గోవా మాత్రం డ్రగ్స్‌కు ప్రధాన కేంద్రంగా మారిందని ఆయన తెలిపారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్‌పై విమర్శలు కొనసాగిస్తూ, ఆయన భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. గోవా అస్తిత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, బీజేపీ ప్రభుత్వం స్థానిక ప్రజల పట్ల తీవ్ర వివక్ష చూపుతోందని మండిపడ్డారు. రెండుసార్లు బీజేపీని నమ్మి గోవా ప్రజలు మోసపోయారని రేవంత్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును, యువతను కాపాడుకోవాలంటే బీజేపీ అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడాలని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

## 'ఓట్ల చోరీ'ని ఆపాలి

మొదటిపేజీ తరువాయి – ప్రతిపక్షాలు తమ పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేశాయి. ఈ అంశాలపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం సుప్రీంకోర్టుకు మార్చ్ నిర్వహించనున్నట్లు ప్రకటించాయి. ఈ మార్చ్‌లో ప్రజలందరూ పాల్గొనాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "ఓట్ల చోరీకి ముగింపు పలకాలని, ఎలక్టోరల్ రోల్స్, ఈవీఎంలకు సంబంధించిన ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, అలాగే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశం తరఫున సీజేఐ సూర్యకాంత్‌కు వినతిపత్రం సమర్పిస్తాం" అని రాహుల్ గాంధీ ఆ వీడియోలో తెలిపారు. "భయపడొద్దు. ప్రేమ, సోదరభావం, దేశభక్తితో కలిసి నడుద్దాం. రేపు యావత్ భారతదేశం సుప్రీంకోర్టుకు కదులుతుంది" అని ఆయన అన్నారు. మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా దేశంలో గందరగోళం, భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. సీజేఐ అపాయింట్‌మెంట్ కోరుతూ తాను, రాహుల్ గాంధీ లేఖలు రాసినట్లు ఖర్గే వెల్లడించారు. సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య సమయం కోరినట్లు తెలిపారు. శనివారం ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలిపిన యువతపై పోలీసులు, బీజేపీ గూండాలు దాడి చేశారని రాహుల్ గాంధీ ఆరోపించారు. నరేంద్ర మోదీ, అమిత్ షా, అజిత్ దోవల్, మోహన్ భగవత్ వంటి వారు భారత ప్రజల గొంతు నొక్కలేరని, వారి పిరికిపంద చర్యలకు భయపడేది లేదని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మార్చ్‌లో యువత, ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజ బృందాలు, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఎమర్జెన్సీ గురించి రాహుల్ ముందు నేర్చుకోవాలి

మొదటిపేజీ తరువాయి – ఆ సమయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడ్డారో రాహుల్ గాంధీ ముందుగా తెలుసుకోవాలని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హితవు పలికారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష బీజేపీని ఎలా అణచివేస్తోందో స్వయంగా చూడటానికి రావాలని ఆయన రాహుల్‌ను ఆహ్వానించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న ఆంక్షలను, 1975లో ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీతో విపక్షాలు పోల్చడంపై కిషన్ రెడ్డి స్పందించారు. ఇవి ఎమర్జెన్సీ కాదని, దేశంలో అశాంతి సృష్టించేందుకు కొన్ని దేశ వ్యతిరేక, అంతర్జాతీయ శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అందుకే ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. విపక్షాలు లేనిపోని సమస్యలను సృష్టించి వ్యవస్థను దెబ్బతీయాలని చూస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్యం పేరుతో కాంగ్రెస్ పార్టీ తమకు నీతులు చెప్పాల్సిన అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. "1975లో కాంగ్రెస్ వేలాది మందిని జైళ్లలో పెట్టింది, మీడియాపై నిషేధం విధించింది, పౌరుల హక్కులను కాలరాసింది" అని ఆయన గుర్తుచేశారు. తెలంగాణలో తాము శాంతియుతంగా కార్యక్రమాలు చేయాలన్నా హైకోర్టు అనుమతి తీసుకోవాల్సి వస్తోందని, ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలపై ఎలాంటి ఆంక్షలు విధిస్తోందో రాహుల్ వచ్చి చూడాలని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని బీజేపీ దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు సేవ చేయడం, వైద్య శిబిరాలు నిర్వహించడం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించడం వంటివి చేపడుతున్నామని ఆయన వివరించారు.

## విజయవాడ ఉత్సవ్ 2.0: ఏపీ ప్రభుత్వానికి ప్రధాని మోదీ ప్రశంసల లేఖ

మొదటిపేజీ తరువాయి – ఈ వేడుకలు మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. దసరా ఉత్సవాలకు అనుగుణంగా ఇవాళ్టి (అక్టోబర్ 11) నుంచి విజయవాడ ఉత్సవ్ 2.0 వేడుకలు ప్రారంభం కానున్నాయి. నగరంలోని మకినేని బసవపున్నయ్య స్టేడియం, పున్నమి ఘాట్ సహా పలు ప్రాంతాలు ఈ ఉత్సవాలకు వేదికలుగా నిలవనున్నాయి. నగరం సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పడంతో పాటు పర్యాటకాన్ని ప్రోత్సహించడం, స్థానిక ఆర్థిక అవకాశాలను మెరుగుపరచడం ఈ ఉత్సవాల ముఖ్య ఉద్దేశం. ఈ వేడుకలను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించనున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా జాతీయ సరస్ మేళాను కూడా నిర్వహిస్తున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసే స్టాళ్లు ఈ మేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఆధ్యాత్మిక పర్యాటకంపై దృష్టి పెట్టడంతో పాటు స్థానిక కళాకారులకు మద్దతు ఇవ్వడమే ఈ ఉత్సవాల ప్రధాన లక్ష్యమని ఎంపీ కేశినేని శివనాథ్ సహా నిర్వాహకులు చెబుతున్నారు. ప్రధాని నుంచి ప్రశంసలు రావడంతో ఈ కార్యక్రమంపై మరింత ఆసక్తి నెలకొంది.

## పత్రికా స్వేచ్ఛపై దాడి

మొదటిపేజీ తరువాయి – రావడం పత్రికా స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించాయి. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను, ప్రజల తరఫున వార్తలు అందించే మీడియాను అడ్డుకోవడం సరికాదని స్పష్టం చేశాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఈనెల 10న ఢిల్లీలో జరిగిన నిరసనలను కవర్ చేస్తున్న సమయంలో జర్నలిస్టులపై ఈ చర్యలు చోటుచేసుకున్నాయి. జంతర్ మంతర్ పరిసరాల్లో పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు పలువురు మీడియా ప్రతినిధులను అదుపులోకి తీసుకున్నట్టు పలు కథనాలు వెలువడ్డాయి.జర్నలిస్టుల రక్షణ కోసం పనిచేసే కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సీపీజే) ఈ ఘటనపై స్పందించింది. అదుపులోకి తీసుకున్న జర్నలిస్టులు, మీడియా సిబ్బందిని వెంటనే విడుదల చేయాలనీ, స్వాధీనం చేసుకున్న పరికరాలను తిరిగి ఇవ్వాలనీ, వారిపై భౌతిక దాడులు జరిగాయన్న ఆరోపణలపై విచారణ జరపాలని ఢిల్లీ పోలీసులను కోరింది. నిరసనలు, వాటిని పోలీసులు ఎదుర్కొంటున్న తీరుపై మీడియా ఎలాంటి అడ్డంకులూ లేకుండా వార్తలు అందించే

## ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి



మొదటిపేజీ తరువాయి – దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ సమస్యలు ఉంటే తప్ప, మిగతా అన్ని చోట్లా ఏర్పాటు చేసిన బారికేడ్లను సమీక్షించి తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో, రైల్వే సేవలను యథాతథంగా కొనసాగించాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప వాటిని నిలిపివేయరాదని నేడు జరిగిన ప్రత్యేక విచారణలో స్పష్టం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన డిమాండ్లతో నిన్న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా అధికారులు భారీ ఆంక్షలు విధించారు. పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం, నిరసనకారులను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి ప్రజలు, వాహనాల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం కాకుండా ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించరాదని తేల్చి చెప్పింది. నిర్దిష్ట ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన చోట మినహా, శాంతియుతంగా సమావేశమయ్యే వారిని అక్రమంగా నిర్బంధించకూడదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలను ఇప్పటికే పునరుద్ధరించామని, మెట్రో కార్యకలాపాలు కూడా పూర్తిగా సాధారణ స్థితికి వచ్చాయని కోర్టుకు తెలియజేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, మెట్రో స్టేషన్ల మూసివేతపై వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని దీనిపై మరిన్ని వివరాలు సమర్పించాలని కోరుతూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

## సీఈసీపై పోరు.. వాయిదా పడిన రాహుల్ గాంధీ గోవా పర్యటన!



మొదటిపేజీ తరువాయి – పాల్గొనేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. వచ్చే వారం ఢిల్లీలో జరగనున్న ఈ నిరసన కార్యక్రమాల్లో ఆయన పాలుపంచుకోవాల్సి ఉన్నందున, గోవా పర్యటనను రీషెడ్యూల్ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రక్రియలోని లోపాలు, ప్రజాస్వామ్య జవాబుదారీతనం వంటి అంశాలపై విపక్ష కూటమి ఈ ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ కీలక సమయంలో రాహుల్ గాంధీ ఢిల్లీలోనే ఉండటం వల్ల విపక్షాల ఐక్యత బలపడుతుందని, పోరాటానికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో పెద్దగా క్రియాశీలంగా లేని పలువురు విపక్ష నేతలు కూడా ఈ నిరసనల్లో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. వాస్తవానికి, 2027 గోవా అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ పర్యటనను ఖరారు చేశారు. పార్టీ కార్యకర్తలతో సమావేశం, ప్రజలతో మమేకం కావడం, సంస్థాగత బలోపేతం వంటి కార్యక్రమాలు చేపట్టాలని ప్రణాళిక రచించారు. అయితే, రాహుల్ పర్యటన వాయిదాపై గోవా కాంగ్రెస్ నేతల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొందరు నేతలు 'ఓట్ల చోరీ'కి వ్యతిరేకంగా జరుగుతున్న జాతీయ స్థాయి పోరాటానికే ప్రాధాన్యం ఇవ్వాలని అంటుండగా, మరికొందరు రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి రాహుల్ పర్యటన ఎంతో ముఖ్యమని అభిప్రాయపడుతున్నారు. ఢిల్లీలో నిరసనలు ముగిసిన తర్వాత గోవా పర్యటనకు సంబంధించిన కొత్త షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

## ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు పకడ్బందీ ప్రణాళిక



మొదటిపేజీ తరువాయి – ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులపై జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి గారు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సిన ప్రమాదం పొంచి ఉండటంతో చేపట్టాల్సిన కార్యాచరణపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సమస్యల విషయంలో సరైన యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే సంక్షోభాన్ని ముందుగా గుర్తించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. సమస్యలను ఎదుర్కోవడానికి అవసరమైన అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రాబోయే 8 నెలలు ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో కీలకమని ముఖ్యమంత్రి గారు అభిప్రాయపడ్డారు. ఈ 8 నెలల పాటు ప్రతి కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ఎల్‌నినో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు పకడ్బందీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని, అయితే మార్కెట్‌లో విద్యుత్ అందుబాటులో లేదని తెలిపారు. అందుకే అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని అధికారులకు సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత మేరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌నినో ప్రభావంపై గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సినిమా, మీడియా, కళాజాతాలతో పాటు వివిధ మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు వేసిన పంటల పరిస్థితులను అంచనా వేసి, పంట చేతికొచ్చే వరకు నీటి కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో నీటి సమస్య తీవ్రతరం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, చుక్క నీరు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు ముఖ్యమంత్రి గారు తెలిపారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్న నేపథ్యంలో, కరువు మండలాల ప్రకటనతో పాటు తగినంత ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని, రూ. 20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరిందని గుర్తుచేశారు. **VB-G RAM G** పథకంలో భాగంగా 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల ఉపాధి కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అవసరమైతే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసే అంశాన్ని మంత్రుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. దసరా తర్వాత గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించేందుకు వార్‌రూమ్‌ను ఏర్పాటు చేయాలని, టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాను సీఎంఓ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి , ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గారు, డీజీపీ సీవీ ఆనంద్ , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పౌరులే లక్ష్యంగా దాడులు ఆమోదయోగ్యం కాదు

మొదటిపేజీ తరువాయి – సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన క్షిపణి దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 300 మందికి పైగా గాయపడ్డారు. పౌరులు, పౌర మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఇలాంటి దాడులు పునరావృతం కావడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. గత దశాబ్ద కాలంలో సౌదీ గడ్డపై జరిగిన అత్యంత భయానక దాడిగా దీనిని భావిస్తున్నారు. రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దేశీయ విమానాల కోసం కేటాయించిన టెర్మినల్స్ 3, 4 ఉన్న ప్రాంతంలో ఈ క్షిపణి దాడి జరిగింది. అక్టోబర్ 10న జరిగిన ఈ దారుణ ఘటనతో పాటు గత కొన్ని రోజులుగా రియాద్ విమానాశ్రయంపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. 'పౌరులపై దాడులను తక్షణమే నిలిపివేయాలి' అని ఆ ప్రకటనలో డిమాండ్ చేసింది. సౌదీ అరేబియా సార్వభౌమత్వాన్ని కాపాడుకునే విషయంలో ఆ దేశ ప్రజలకు, ప్రభుత్వానికి భారత్ అండగా నిలుస్తుందని తెలిపింది. ఈ ప్రాంతంలో వీలైనంత త్వరగా శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్షించింది. ఈ దాడి వెనుక యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారుల హస్తం ఉందని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ఆరోపించాయి. మృతుల్లో సౌదీ, బంగ్లాదేశ్, పాలస్తీనా, అమెరికా, ఈజిప్ట్, జోర్డాన్, సిరియా, సూడాన్ పౌరులు ఉన్నారు. ఈ వారంలో రియాద్ విమానాశ్రయంపై ఇది మూడో దాడి కావడం గమనార్హం. దాడి కారణంగా శనివారం విమానాశ్రయ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసి, విమానాలను దారి మళ్లించారు.

## ధరల పెరుగుదలకు మేం కారణం కాదు: ట్రంప్ ఆరోపణలను తిప్పికొట్టిన జెలెన్‌స్కీ



మొదటిపేజీ తరువాయి – తీవ్రంగా ఖండించారు. పశ్చిమాసియా సంక్షోభం, హార్మూజ్ జలసంధి దిగ్బంధనం వల్లనే ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరుగుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రముఖ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్ చేస్తున్న విమర్శలకు జెలెన్‌స్కీ దీటుగా బదులిచ్చారు. "పుతిన్‌ను ఎలా అడ్డుకోవాలో వారికి తెలియదు. బలహీనులపై ఒత్తిడి తీసుకురావడం సులభం కాబట్టి, ఇంధన ధరల పెరుగుదలను ఉక్రెయిన్‌తో ముడిపెట్టి మాట్లాడుతున్నారు" అని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలపై ఉక్రెయిన్ చేస్తున్న డ్రోన్ దాడుల కారణంగానే అమెరికాలో డీజిల్ ధరలు పెరుగుతున్నాయని ట్రంప్ ఆరోపించారు. ఈ దాడుల వల్ల అమెరికా రైతులు, పాడి పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే వీటిని నిలిపివేయాలని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన జెలెన్‌స్కీ, 'ఇంధన కాల్పుల విరమణ'కు తాము సిద్ధమని ప్రకటించారు. రష్యా గనుక తమ ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు నిలిపివేస్తే, తాము కూడా రష్యా ఇంధన కేంద్రాలపై దాడులను ఆపేస్తామని ప్రతిపాదించారు. "మాపై దాడులు ఆపండి, మా పిల్లలను చంపకండి.. అప్పుడు మేము కూడా మీ డీజిల్ కేంద్రాలపై దాడులు నిలిపివేస్తాం. ఇదొక సరైన ఒప్పందం అవుతుంది" అని ఆయన పేర్కొన్నారు. గత వారం రోజుల్లోనే రష్యా తమ విద్యుత్ రంగంపై 196 సార్లు, చమురు, గ్యాస్ కేంద్రాలపై 20 సార్లు దాడులు చేసిందని, ఈ ఘటనల్లో 153 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని జెలెన్‌స్కీ వివరించారు. ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో స్పందిస్తూ.. "రష్యా, ఉక్రెయిన్ మధ్య తక్షణమే 'ఇంధన కాల్పుల విరమణ' అమల్లోకి వచ్చింది. దీనికి ఇరు పక్షాలు అంగీకరించాయి" అని పోస్ట్ చేయడం గమనార్హం. అయితే, ఈ ప్రకటన తనకు ఆశ్చర్యం కలిగించిందని, మాస్కో నుంచి దీనిపై ఎటువంటి సమాచారం లేదని జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్‌లో కొత్త అధ్యక్షుడు రావాలన్న ట్రంప్ పిలుపునకు బదులిస్తూ.. 60 రోజుల పాటు సంపూర్ణ కాల్పుల విరమణ ప్రకటిస్తే, దేశంలో ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధమని జెలెన్‌స్కీ మరో ప్రతిపాదన చేశారు.

## కొలనూర్ గ్రామంలో కుక్కల బెడద

# రైతుకు చెందిన దూడపై కుక్కల దాడి



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఓదెలా మండలం కొలనూర్ గ్రామంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో గ్రామ ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన దూడపై కుక్కలు దాడి చేసి చంపడంతో రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఘటనతో గ్రామంలోని పశువుల పెంపకందారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, గ్రామ ప్రజలకు కూడా ప్రమాదం పొంచి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కల బెడదను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. రైతుకు జరిగిన నష్టాన్ని సంబంధిత అధికారులు పరిశీలించి తగిన సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

## ఘనంగా సరస్వతి విద్యాలయం పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా , అక్టోబర్ 11 :** మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం కృష్ణ కాలనీలోని సరస్వతి విద్యాలయంలో పదో తరగతి పూర్తి చేసుకొని 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థులు "సిల్వర్ జూబ్లీ" ఆత్మీయ సమ్మేళనాన్ని (గెట్ టుగెదర్) ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యాభ్యాసం పూర్తయి పాతికేళ్లు గడిచిన వేళ.. నాటి బాల్య జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ పూర్వ విద్యార్థులు మంచిర్యాల సమీపంలోని 'గాంధారి వనం'లో ఉత్సాహంగా, ఆనందంగా గడిపారు. ప్రస్తుతం వివిధ హోదాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఎంఆర్ఓ, ఎస్ఐ , కానిస్టేబుల్స్, సింగరేణి ఉద్యోగులతో పాటు పలు వ్యాపార రంగాల్లో రాణిస్తున్నప్పటికీ.. ఏలాంటి హోదాలు, బేధాభిప్రాయాలు లేకుండా అంతా ఒక్కటై నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. "చిన్ననాటి స్నేహబంధం ఎంతో విలువైంది. ఎన్ని ఏళ్లు గడిచినా, ఏ స్థానంలో ఉన్నా ఒకే చోట కలిసి పాత రోజులను గుర్తుచేసుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది" అని ఆనందం వ్యక్తం చేశారు. రోజంతా ఆటపాటలతో, సరదా ముచ్చట్లతో ఆత్మీయ వాతావరణంలో వేడుకలు జరుపుకున్నారు. భవిష్యత్తులో కూడా ఇదే రీతిలో కలుస్తూ, ఒకరికొకరు తోడ్పాటు నందించుకోవాలని నిర్ణయించుకున్నారు.

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ని

# కలిసిన సుదర్శన్ యాదవ్



**మహేశ్వరం అక్టోబర్ 11, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని సోమవారం మహేశ్వరం మాజీ ఎంపిటిసి, రంగారెడ్డి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పోతర్ల సుదర్శన్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియమితులైనందుకు సుదర్శన్ యాదవ్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, మీడియా కన్వీనర్ మోతే యాదయ్య, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు జంగయ్య, రవీందర్ రెడ్డి, భూత్ అధ్యక్షుడు రాఘవేందర్, ఆకుల నరేష్ పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మామిడిపల్లి ఏడిఈ శంకర్..

**మహేశ్వరం, అక్టోబర్ 11, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** నేడు తుక్కుగూడ పరిధిలోని వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏ డి ఈ శంకర్ తెలిపారు. విద్యుత్ మరమ్మతులలో భాగంగా ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ట్రాన్స్ కో లైన్ ల మరమతుల కారణంగా కావూరి హిల్స్, ప్రజయ్ విల్లాస్, ఇమామ్ గూడ, శ్రీశైలం రోడ్ ఏరియాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించగలరని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## అనాధాశ్రమంలో డాక్టర్ కొమ్ము

# అశోక్ యాదవ్ జన్మదిన వేడుకలు





**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా అక్టోబర్ 11 :** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కల్వరి అనాధాశ్రమంలో తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తి దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ జన్మదిన వేడుకలను జిల్లా అధ్యక్షులు చిల్లారపు సంతోష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ యాదవ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, గొల్ల కురుమల కోసం నిరంతరం నిస్వార్థ సేవలు అందిస్తూ నిరుపేదలకు కరోనా నేపథ్యంలో అనేక సేవలు చేసి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డులు తీసుకున్న మహా నాయకుడు ఆయన జన్మదిన వేడుకలు చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం తో పాటు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.అనంతరం కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ హాజరై మాట్లాడుతూ నా జన్మదిన వేడుకలు చేస్తున్న జిల్లా అధ్యక్షులు చిల్లారపు సంతోష్ యాదవ్ కి జిల్లాలోని ప్రతి మండల నాయకులకు నా జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అల్లముల సదానందం యాదవ్ భీమారం మండల ప్రధాన కార్యదర్శి కేశవేణి సత్యనారాయణ యాదవ్ మందమరి మండల ఉపాధ్యక్షులు సందన వేణి మల్లేష్ యాదవ్ అల్లాముల మహేష్ యాదవ్ నవీన్ యాదవ్ కల్వరి ఆశ్రమం సమస్త డైరెక్టర్ కుమార్ మండల నాయకులు దాడి రాజబాబు జాగటి సమ్మయ్య రాజన్న యాదవ్ పాల్గొన్నారు

# పినపాక నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

ఓటరు నమోదులో ఎంత ముందుంటే... అంత మెజారిటీతో గెలుపు ఖాయం...జిల్లా దీ=ా పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి)మణుగూరు అక్టోబర్ 11:-** పినపాక నియోజకవర్గం మణుగూరు మండలం హనుమాన్ ఫంక్షన్ హాల్ నందు గ్రాడ్యుయేట్ ఎన్నికల సందర్భంగా శ్రీ రేగా కాంతారావు ఆధ్వర్యంలో నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగినది....పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియ పై పినపాక నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ ఉద్యమకారులు దిండిగల రాజేందర్, ఖమ్మం-నల్గొండ-వరంగల్ కంటెస్టెంట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి,ముఖ్య నాయకులతో కలిసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చే అంశాలను చర్చించడం జరిగింది.

**ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ...**

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి,ప్రజల సమస్యలపై మరింత బలంగా పోరాడటానికి ఈ ఎన్నిక ఒక అవకాశంగా ఉపయోగించుకోవాలి.కాంగ్రెస్ మెడలు వంచడానికి పట్టభద్రుల తీర్పు కీలకం. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీకి ప్రజల అసంతృప్తిని స్పష్టంగా తెలియజేసే అవకాశం ఉంది. కర్రు కాల్చి వాత పెట్టినట్టుగా ప్రజల తీర్పు ఉండాలి.అలా అయితేనే రాబోయే రెండేళ్లు ప్రభుత్వం ప్రజల సమస్యలపై మరింత బాధ్యతగా పనిచేస్తుంది. ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో పట్టభద్రుల వివరాలను సేకరించి, అర్హత ఉన్న వారందరికీ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలి.ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వ్యాపారులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు, విద్యావంతులందరినీ ఓటరుగా నమోదు చేయించేందుకు కార్యకర్తలు కృషి చేయాలి.ఒక పట్టభద్రుడు కూడా ఓటరు నమోదుకు దూరం కాకుండా ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలి.ఓటరు నమోదు విషయంలో ఇతర పార్టీల కంటే ముందుండాలి. ఎంత ఎక్కువ మంది అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయిస్తే... అంత బలమైన ప్రజాస్వామ్య తీర్పును సాధించగలుగుతాం.ఈ ఎన్నిక కేవలం ఒక ఎమ్మెల్సీని ఎన్నుకునే ఎన్నిక కాదు. తెలంగాణలో రాబోయే రాజకీయ పరిణామాలకు దిశానిర్దేశం చేసే ఎన్నిక.పట్టభద్రులు వేసే ప్రతి ఓటు రాష్ట్రంలో పాలన ఎలా ఉండాలి? ప్రజల సమస్యలపై ప్రభుత్వం ఎలా స్పందించాలి? అనే విషయానికి ఒక సందేశాన్ని ఇస్తుంది. అందుకే ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలి.గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లు, స్టడీ సర్కిళ్లు, ఉద్యోగుల వర్గాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి.అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు అయ్యేలా చూడాలి.ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోయి అధికార పార్టీకి ప్రయోజనం కలగకుండా పట్టభద్రులు ఆలోచించి నిర్ణయం తీసుకునేలా ప్రోత్సహించాలి.ఓటరు నమోదు ప్రక్రియలో మనం ఎంత ముందుంటే... రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మన విజయం అంత స్పష్టంగా ఉంటుంది అని అన్నారు...ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు,ప్రజా ప్రతినిధులు,మాజీ ప్రజా ప్రతినిధులు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు....

# యువత రాజకీయాల్లోకి రావాలి రాజకీయ ఎదుగుదలకు కాంగ్రెస్ పార్టీ మీకు ఒక చక్కని వేదిక

గ్రామస్థాయి నుంచే మార్పుకు శ్రీకారం చుట్టాలి..
ప్రజాసేవలో యువత భాగస్వాములు కావాలి
మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఒరుగంటి రమేష్ బాబు పిలుపు



**భద్రాద్రి కొత్తగూడెం,(పోరు తెలంగాణ-పినపాక నియోజకవర్గ ప్రతినిధి) అశ్వాపురం అక్టోబర్ 11:-** అశ్వాపురం మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఒరుగంటి వీరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షుడు ఒరుగంటి రమేష్ బాబు మాట్లాడుతూ... దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజాసేవలో చురుకుగా భాగస్వాములు కావాలని అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఒరుగంటి రమేష్ బాబు పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచే సామాజిక మార్పుకు శ్రీకారం చుట్టాలని, గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి యువత కృషి చేయాలని సూచించారు. సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని, ప్రజల అవసరాలను అర్థం చేసుకొని బాధ్యతాయుతమైన నాయకత్వంతో ముందుకు సాగాలని అన్నారు.యువతలోని నూతన ఆలోచనలకు, నాయకత్వ లక్షణాలకు కాంగ్రెస్ పార్టీ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. యువత ఆశయాలకు ప్రోత్సాహం అందిస్తూ ప్రజాసేవలో వారికి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని తెలిపారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా, ప్రజాసేవ మార్గంగా, సామాజిక మార్పు సంకల్పంగా యువత ముందుకు సాగాలని ఒరుగంటి రమేష్ బాబు పిలుపునిచ్చారు. యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి, సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని మండల అధ్యక్షుడు ఒరుగంటి రమేష్ బాబు కోరారు

# తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్య శిబిరం

122 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన హీమటాలజిస్ట్ డాక్టర్ రంజిత్ కుమార్




**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా అక్టోబర్ 11 :** మంచిర్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్త నిధి కేంద్రం ఆధ్వర్యంలో తలసేమియా, సికిల్ సెల్ తదితర రక్త సంబంధిత వ్యాధిగ్రస్తుల సహాయార్థం ఆదివారం హీమటాలజీ మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరంలో హైదరాబాద్‌లోని సింధు హాస్పిటల్ చెందిన ప్రముఖ హీమటాలజిస్ట్ డాక్టర్ రంజిత్ కుమార్ సి.ఎస్. గారు 122 మంది వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సూచనలు అందించారు.

**తలసేమియా రోగులు వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి: డాక్టర్ రంజిత్ కుమార్**

ఈ సందర్భంగా డాక్టర్ రంజిత్ కుమార్ సి.ఎస్. గారు మాట్లాడుతూ, తలసేమియా వ్యాధిగ్రస్తులు వైద్యుల పర్యవేక్షణలో హిమోగ్లోబిన్ స్థాయిని తగిన స్థాయిలో, సాధారణంగా సూచించిన విధంగా 9 గ్రాముల వరకు నిర్వహించుకోవాలని తెలిపారు. శరీరంలో అధికంగా పేరుకుపోయే ఐరన్‌ను నియంత్రించేందుకు వైద్యుల సూచనల మేరకు ఐరన్ చిలేషన్ మందులు వాడాలని సూచించారు. తగిన అర్హత, వైద్య పరిస్థితులు ఉన్న కొంతమంది రోగులకు బోన్ మ్యారో మార్పిడి ద్వారా వ్యాధి నుంచి విముక్తి పొందే అవకాశం ఉంటుందని వివరించారు. వ్యాధిగ్రస్తులు అవసరమైన టీకాలు కూడా వైద్యుల సలహా మేరకు వేయించుకోవాలని సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ చందూరి మహేందర్ గారు మాట్లాడుతూ, మంచిర్యాల రక్త నిధి కేంద్రం పరిధిలో ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన సుమారు 976 మంది తలసేమియా, సికిల్ సెల్ తదితర వ్యాధిగ్రస్తులు వైద్యుల పర్యవేక్షణలో ఉచిత వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. వీరిలో అధికశాతం నిరుపేద కుటుంబాలకు చెందిన వారని, వారి ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రెడ్ క్రాస్ సొసైటీ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత మందులు,డీఎన్ఏ పరీక్షల శిబిరాలు, హెచ్ఎల్ఏ మ్యాచింగ్ క్యాంపులు నిర్వహించడంతో పాటు, హైదరాబాద్ నుంచి నిపుణులైన వైద్యులను ఆహ్వానించి హీమటాలజీ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. 122 మందికి తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించిన హీమటాలజిస్ట్ డాక్టర్ రంజిత్ కుమార్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరపున శాలువాతో ఘన సన్మనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ చందూరి మహేందర్, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, మంచు శంకర్ వర్మ, రక్త నిధి కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రియాంక సక్సేనా, డాక్టర్ బి. ప్రేమ్ సాయి, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్, రక్త నిధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అవయవ దాతలే నిజమైన హీరోలు

సదాశయ ఫౌండేషన్ 18 వ వార్షికోత్సవం
ముఖ్య అతిథి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు





**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలో ఆదివారం శ్రీ లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ లో జరిగిన సదాశయ ఫౌండేషన్ 18 వ వార్షికోత్సవానికి జాతీయ కార్యదర్శి మెరుగు భీష్మచారి అధ్యక్ష వహించగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు హాజరైనారు అనంతరం వారు మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయిన దుఃఖంలోనూ వారీ నేత్రాలను దానం చేసి మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముందుకు రావడం స్ఫూర్తిదాయకామని అన్నారు ఇలాంటి కార్యక్రమాలను ప్రభుత్వపరంగా గుర్తించే విధంగా నా వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు ఎమ్మెల్యే కు షీల్డ్ అందించి ఘనంగా సన్మానించారు. సదాశయ ఫౌండేషన్ 18వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే దాతల కుటుంబాలకు షీల్డ్ అందించి ఘనంగా సన్మానం చేశారు. అలాగే

**పెద్దపల్లి డి ఎం హెచ్ ఓ పవిత్ర మాట్లాడుతూ**

అవయవ దాతలే నిజమైన హీరోలని మరణానంతరం విలువైన అవయవాలను దానం చేసి.. మరో దేహంలో చిరంజీవులుగా జీవించాలని పిలుపునిచ్చారు. సదాశయ ఫౌండేషన్ 18వ వార్షికోత్సవా. ఈ సందర్భంగా నేత్ర, అవయవ, శరీర దానాలు చేసిన వారి కుటుంబ సభ్యులను జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు. అవయవదానంలో తెలంగాణ రాష్ట్రంలోనే ఓదెల ముందంజ అవయవదానాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ సదాశయ ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. అవయవదానాల్లో ఓదెల మండలం రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. అవయవదానాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తరఫున తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఫౌండేషన్ ప్రతినిధులు అందజేసిన వినతిపత్రాన్ని స్వీకరించారు.

**నేత్రదానానికి ముందుకు రావాలి**

వెలకట్టలేని నేత్రాలు, అవయవాలను దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నేత్రదానాలకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. నేత్రదానాల కోసం సాంకేతిక నిపుణులు చేస్తున్న కృషితోపాటు సదాశయ ఫౌండేషన్ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. తాను కూడా మరణానంతరం నేత్రదానం చేసేందుకు త్వరలో అంగీకారం తెలుపుతానని వేదికపై ప్రకటించారు.

**దాతల కుటుంబాలకు సన్మానం**

గత ఏడాది నేత్ర, అవయవ, శరీర దానాలు చేసిన వారి కుటుంబ సభ్యులతోపాటు దానాలను ప్రోత్సహించినవారిని, వార్షికోత్సవ నిర్వహణకు సహకరించిన సంస్థల ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ డాక్టర్ కనికిరెడ్డి సతీష్, మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య అధికారి శభాష్ ఖాన్, ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి మెరుగు భీష్మాచారి వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఫౌండేషన్ ప్రతినిధులు , ఓదెల మండల అధ్యక్షులు కొంద్ర వేణు, మెరుగు సారంగం, డాక్టర్ ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు క్యాతం మల్లేశం అల్లం సతీష్ జీడి నవీన్ , భారత్ గ్యాస్ సత్యనారాయణ,మహిళా ప్రతినిధులు క్యాతం భాగ్యలక్ష్మి మెరుగు దేవకి మెరుగు కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంఘము ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 11(పోరు తెలంగాణ న్యూస్:) :** కామారెడ్డి పట్టణంలోని గాంధీ నగర్లో గల ఆర్యవైశ్య అభివృద్ధి సంఘం వారి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం వాసవి సేవాదళ్ అధ్యక్షులు మహంకాళి విజయ్, ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, ఆర్యవైశ్య మహాసభ రిజినల్ చైర్మన్ గౌరీ శంకర్, పాతశివ కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్య అభివృద్ధి కమిటీ సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. ముందస్తుగా కామారెడ్డి పట్టణ ప్రజలకు బతుకమ్మ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య అభివృద్ధి కమిటీ సంఘం అధ్యక్షులు సిద్ధంశెట్టి రమణ, ప్రధాన కార్యదర్శి నంగునూరి వెంకటేశం, ఉపాధ్యక్షులు ఎనిశెట్టి శ్రీనివాస్, ఎర్రం నాగరాజు, వెంకటరాజు, సహాయ కార్యదర్శిలు బాలరాజు, మురికి రాజు, తృప్తి అనిల్, పాత ధర్మరాజు, లాబిశెట్టి శ్రీనివాస్, దోమకొండ రామకోటి, పసునూరి వెంకటరాజు, ఆర్యవైశ్య అభివృద్ధి కమిటీ సభ్యులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు ఎల్ నినో పై ముఖ్యమంత్రి ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం



### మండల వ్యవసాయ అధికారి భాస్కర్

**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఉదయం 10:00 గంటల నుండి

వేదిక: రైతు వేదిక ఓదెల , పోత్కపల్లి రైతు వేదిక, గుండ్లపల్లి రైతు వేదిక లో రైతు నేస్తం

ప్రజాప్రతినిధులకు, వివిధ శాఖల అధికారులకు , ప్రియమైన రైతు సోదర సోదరీమణులకు ఆహ్వానం. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్న "రైతు నేస్తం" కార్యక్రమం రైతు వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది అని మండల వ్యవసాయ అధికారి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న రబీ సీజన్‌కు పంటల ప్రణాళిక, పంటల వైవిధ్యీకరణ, అనువైన పంటల ఎంపిక, పంటల సాగు ,యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించబడుతుంది. కావున, మండలంలోని స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ , అనుబంధ శాఖల అధికారులు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా సాదరంగా ఆహ్వానిస్తున్నాము. రైతు సోదర సోదరీమణులు తమకు సమీపంలోని రైతు వేదికకు ఉదయం 10:30 గంటలకే చేరుకొని, కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరడమైనది. మీ అమూల్యమైన హాజరు, సహకారం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి దోహదపడతాయని ఆశిస్తున్నామ

# రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారికి లింగాపూర్‌లో ఘన సన్మానం

### లింగాపూర్‌లో శంకర్ నాయక్ దంపతులకు సత్కారం....



**పోరు తెలంగాణ అక్టోబర్ 11: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారిగా నియమితులైన నూణావత్ శంకర్ నాయక్, నిర్మల దంపతులను కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు, అఖిల భారత బంజారా సేవా సంఘం (ఏఐబీఎస్ఎస్) ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కార్యవర్గాలు, మండల ప్రజాప్రతినిధులు, మీడియా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శంకర్ నాయక్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి, గజమాలతో సత్కరించారు. అనంతరం మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. మారుమూల గిరిజన ప్రాంతానికి చెందిన వ్యక్తి రాష్ట్ర స్థాయి కీలక బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

**గిరిజన ప్రాంతానికి గర్వకారణం రాథోడ్ రవీందర్**

ఏఐబీఎస్ఎస్ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రవీందర్ మాట్లాడుతూ, లింగాపూర్ మండలం పిక్ల తాండకు చెందిన శంకర్ నాయక్ అదనపు ఎన్నికల అధికారిగా నియమితులు కావడం జిల్లా ప్రజలకు, బంజారా సమాజానికి, గిరిజన జాతికి గర్వకారణమన్నారు. మారుమూల గిరిజన ప్రాంతంలో పుట్టి, ఉన్నత విద్య అభ్యసించి, తన ప్రతిభతో రాష్ట్ర సచివాలయంలో కీలక బాధ్యతలు నిర్వహించే స్థాయికి ఎదగడం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. గతంలో హోంశాఖ, నీటిపారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన విభాగాల్లో పనిచేసి పరిపాలనా రంగంలో తనదైన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. తన అనుభవం, నిబద్ధత, పరిపాలనా దక్షతతో ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, బంజారా సమాజ అభ్యున్నతికి ఉన్నత స్థానాల్లోని అధికారులు సహకరించడం ముఖ్యమని రవీందర్ అన్నారు. శంకర్ నాయక్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని, మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐబీఎస్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ భీంరావ్, రాథోడ్ నారాయణ, యశ్వంత్ రావ్, రాథోడ్ సేశారావ్, లింగాపూర్ సర్పంచ్ జాదవ్ రాజశేఖర్, గ్రామ నాయక్ రాథోడ్ కిరణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాదవ్ రమేష్, మాజీ జడ్పీటీసీ నాగర్‌గోజే విశ్వంబర్, మాజీ ఎంపీటీసీలు రాథోడ్ బలిరామ్, జాదవ్ గణపత్, మాజీ సర్పంచ్ రాథోడ్ సుమలత ఈశ్వర్, జాదవ్ జాదూ, రాథోడ్ వినోద్, ఆడే లక్ష్యా నాయక్, రాథోడ్ రాంచంద్, జాదవ్ రామారావ్, పవార్ సంతోష్, జాదవ్ నాను, జాటోత్ దేవి, బానోత్ హాసీరామ్, లాకావత్ బాబు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# "బతుకమ్మ ఎక్స్‌ప్రెస్"గా నామకరణం చేయాలని వినతి

### ప్రత్యేక రైలును రెగ్యులరైజ్ చేయాలని కిషన్ రెడ్డికి హరీష్ బాబు వినతి....





Dr. PALVAI HARISH BABU
MS (Ortho) DNB (Ortho)
MLA, Sirpur - 001
TELANGANA LEGISLATIVE ASSEMBLY

Mobile : 9502781218
Email : harishpalvai@gmail.com

Lr.No.227/2026/HYD/MLA-Sirpur, dated: 11/10/2026

Shri G. Kishan Reddy Garu, Namaste,

Sub: Regularisation of Bathukamma Special Express Train No. 07711/07712 from Secunderabad Jn-Sirpur Kagaznagar - Hyderabad-Naming it as Bathukamma Express- Request - Regarding.

This is to bring to your kind notice that a special train with No.07711/07712 Secunderabad Jn-Sirpur Kagaznagar-Hyderabad has been launched by South Central Railway in view of Bathukamma, Navratri and Dasara from 09/10/2026 to 25/10/2026. This special train has received huge response and is running by full booking and also has a huge waiting list for the passengers.

I request you to take cognizance of the matter and continue this special train till Diwali festival so that the rush in this route especially Kazipet Jn, Jammikunta, Ramagundem, Mancherial, Bellampally and Sirpur Kagaznagar is cleared.

Also, when Shri Bandaru Dattatreya Garu was the MoS during Vajpayee ji government, has launched a new train from Secunderabad Jn to Sirpur Kagaznagar named Telangana Express (now called Kagaznagar SF Express) Train No.12757/12758. This was a huge hit and people still remember him for having launched a regular train in this route.

Keeping in view the huge demand and already existing triple line and the proposed multi tracking in this route, I request you to impress upon the railway authorities to regularize this train and name it aptly after Bathukamma festival as Bathukamma Superfast Express so that the cultural festival of Telangana is highlighted. This will surely bring laurels to your office and railway authorities as well.

Thanking you in anticipation,

Regards
(Dr. Palvai Harish Babu)

Shri G. Kishan Reddy Garu,
Hon'ble Minister for Coals and Mines,
Government of India,
New Delhi.

H.No. 3-4-20, Sirsilk Colony, Kagaznagar - 504296, Kumuram Bheem Asifabad Dist.

**పోరు తెలంగాణ అక్టోబర్ 11: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సికింద్రాబాద్ జంక్షన్ నుంచి సిర్పూర్--కాగజ్‌నగర్ మధ్య 17 రోజుల పాటు ప్రత్యేక రైలు నడుపుతున్నందుకు సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డిని కలిసి ఈ మేరకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి బతుకమ్మను అందజేశారు. ఈ ప్రత్యేక రైలును శాశ్వతంగా నడపాలని, దీనికి "బతుకమ్మ ఎక్స్‌ప్రెస్" అని పేరు పెట్టడం ద్వారా తెలంగాణ పూల పండుగకు తగిన గుర్తింపు ఇచ్చినట్లు అవుతుందని కోరారు. ఈ విషయంలో కేంద్ర రైల్వే మంత్రిని ఒప్పించాలని విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ, ఈ రైలు బతుకమ్మకు గుర్తింపుగా నిలవడంతో పాటు ఉత్తర తెలంగాణ ప్రజలకు ప్రత్యేక రవాణా సౌకర్యంగా ఉంటుందన్నారు. ఇప్పటికే ఈ రైలులో టికెట్లు పూర్తిగా బుక్ అయి, వెయిటింగ్ లిస్టులో కూడా ప్రయాణికులు ఉన్నారని తెలిపారు. రైలును రెగ్యులరైజ్ చేసి రోజూ నడిపితే కాజీపేట, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ ప్రాంతాలకు మరో రోజువారీ రైలు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రాష్ట్ర సంస్థాగత కార్యదర్శి మధుకర్, సహ ఇంచార్జ్ అభయ్ పాటిల్, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అరవింద్, ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, అంజిరెడ్డి, మల్క కొమురయ్య, పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అశోక్ మహుల్కార్

### ఆసిఫాబాద్ జిల్లా కమిటీ ఏకగ్రీవం....



**పోరు తెలంగాణ అక్టోబర్ 11: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సంస్థాగత ఎన్నికలు నిర్వహించారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ అశోక్ మహుల్కార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కిర్మిల్ల వినోద్ చారి, సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గ ఇంచార్జి కావేటి సబిత మనోహర్ ఈ విషయాన్ని ప్రకటించారు. ఎన్నికైన ఇతర నాయకులు ఆర్గనైజింగ్ సెక్రటరీ కావేటి మనోహర్ జాయింట్ సెక్రటరీలు: మాచర్ల శ్రీనివాస్ (కాగజ్‌నగర్), సాయికుమార్ (ఆసిఫాబాద్), యశ్వంత్ రావు కోశాధికారి ఎండీ మోసిన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ అర్షద్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రాథోడ్ పుష్పలత జిల్లా అధికార ప్రతినిధులు ఆత్రం వినోద్, శశికళ జిల్లా కార్యవర్గ సభ్యులు అబ్బూ తాలిబ్, పెందూర్ దర్ము, నైతం తిరుపతి, జె. కరుణాకర్, పెందోర్ దౌలత్, జీవన్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దుర్గం శ్యాంరావు ట్రేడ్ అండ్ కామర్స్ విభాగం అధ్యక్షుడు మైనొద్దీన్ సోషల్ మీడియా ప్రతినిధి: షేక్ ఆదిల్ ఈబీసీ విభాగం అధ్యక్షుడు జాడి నందకిషోర్ ప్రజా ఉద్యమకారుల విభాగం అధ్యక్షుడు: చోటు వీరందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధినేత్రి ప్రకటించారని జిల్లా అధ్యక్షుడు వినోద్ చారి తెలిపారు.

# రెబ్బెనలో కాంగ్రెస్ కమిటీల సమావేశం

### పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి....

### శ్యామ్ నాయక్....



**పోరు తెలంగాణ అక్టోబర్ 11: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ కమిటీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. సమావేశంలో శ్యామ్ నాయక్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో కమిటీలను మరింత బలోపేతం చేసి, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ సిద్ధాంతాలను ప్రతి గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తల ఐక్యతే పార్టీకి బలమని, అందరూ సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీసీసీ జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వైరాగడ్ మారుతి పటేల్ విశ్వనాథ్రె, మాజీ సర్పంచ్ కాశన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు చిరంజీవి గౌడ్, దుర్గం దేవాజీ, చిన్న సోమశేఖర్, ఎస్సీ విభాగం జిల్లా జనరల్ సెక్రటరీ డోంగ్రి నిలయ, జిల్లా ఉపాధ్యక్షుడు రత్నమానంద్, అసెంబ్లీ ప్రెసిడెంట్ జాడి ప్రసాద్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకటేష్ చారి, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు దుబ్బా నాయక్, తదితరులు పాల్గొన్నారు.



# పేకాట రాయుళ్లపై పోలీసుల ఉక్కు పాదం

### పేకాట ఆడుతున్న ఎనిమిది మంది పై కేసు నమోదు....

**పోరు తెలంగాణ అక్టోబర్ 11: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానపల్లి మండలంలోని రనవెల్లి గ్రామ శివారులో గల ప్రాణహిత నది ఒడ్డున ఈరోజు పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు దాడి చేసి ఎనిమిది మంది నిందితులను పట్టుకోవడం జరిగింది. వీరు రణవెల్లి గ్రామానికి చెందిన ఆడప తిరుపతి మరియు లంబడిహట్టి గ్రామానికి చెందిన రమేష్ అనే వ్యక్తులు నిర్వహిస్తున్నట్లుగా తెలిపినారు. 26,100 రూపాయలను సీజ్ చేయడం జరిగింది. ఐదు ద్విచక్ర వాహనాలను కూడా సీజ్ చేయడం జరిగింది. నేర స్థలం నుండి కొద్దిమంది పారిపోగా వాళ్ళ పైన కూడా కేసు నమోదు చేయడం జరిగింది అని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని చింతల మానేపల్లి ఎస్సై అన్నారు.

### శివగంగ పుణ్యక్షేత్రంలో

# దసరా నవరాత్రుల ఉత్సవాలు



**మహేశ్వరం, అక్టోబర్ 11, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** మహేశ్వరంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ శివ గంగ రాజరాజేశ్వరి, రాజా రాజేశ్వర స్వామి దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఆదివారం శ్రీ రాజరాజేశ్వర రాజరాజేశ్వరి అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అలంకరణలో కొలువుదీరారు. దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మహేశ్వరం శివగంగ పుణ్యక్షేత్రాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరణతో తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ చైర్మన్ అల్లె కుమార్, ఈవో మురళీకృష్ణ, దేవస్థాన కమిటీ సభ్యులు, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా సీరత్ ఉన్ నబీ వేడుకలు

### వేడుకలలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నరసింహారెడ్డి..




**మహేశ్వరం, అక్టోబర్ 11, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని బాలాపూర్ డివిజన్ బడంగ్ పేట్ సర్కిల్ ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీరత్ ఉన్ నబీ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొన్నారు. వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆమె బహుమతులను అందజేశారు. విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాలలో రాణించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో షరీఫ్, అబ్దుల్లా యమాని, అఖిల్, అఫ్జల్ డివిజన్ అధ్యక్షుడు శ్రీరాములు పాల్గొన్నారు.

# దుర్గామాత పూజలో పాల్గొన్న నాయకులు



**మహేశ్వరం, అక్టోబర్ 11, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** మన్ సాన్ పల్లి గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన దుర్గ మాత వేడుకలలో గ్రామ సర్పంచ్ వట్టెల పుష్పమ్మ మల్లేష్ యాదవ్, మాజీ సర్పంచ్ కంది అరుణ రమేష్, ఉప సర్పంచ్ రాఘవేందర్ రెడ్డి, వార్డు సభ్యులు రాఘవేందర్ గౌడ్, సురేష్, ఆంజనేయులు గౌడ్, కృష్ణ, రాజు యాదవ్ గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గామాత దీవెనలు గ్రామ ప్రజలపై ఉండాలని వారు వేడుకున్నారు.

# భీమారం లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభం

### భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు





**పోరు తెలంగాణ, మంచిర్యాల జిల్లా, అక్టోబర్ 11 :** భీమారం మండల కేంద్రంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో, పూలతో అందంగా అలంకరించారు. మండపాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు, హారతులు నిర్వహించనున్నారు. దుర్గాదేవి నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తాయని, చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతమని భక్తులు పేర్కొన్నారు.

# వర్షాల కోసం కప్పతల్లి ఆటలు

### చింతలమానేపల్లిలో రైతుల ప్రార్థనలు....



**పోరు తెలంగాణ అక్టోబర్ 11: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలోని బాబాసాగర్, ధరంపల్లి, ఎక్స్ రోడ్ తదితర గ్రామాల్లో వర్షాలు కురవాలని రైతులు కప్పతల్లి ఆటలు ఆడారు. కొన్ని రోజులుగా వానలు లేక పంటలు ఎండిపోతుండటం, భూముల్లో పగుళ్లు రావడంతో ఆందోళన చెందిన రైతులు పూర్వీకుల నుంచి వస్తున్న ఆనవాయితీ ప్రకారం ఈ ఆచారాన్ని నిర్వహించారు. గ్రామంలోని యువకులు, రైతులు కప్పతల్లి వేషం వేసి, తలపై బిందెలతో నీళ్లు చల్లుకుంటూ వీధుల్లో ఇంటింటికీ తిరిగారు. "కప్పతల్లి.. కప్పతల్లి.. వర్షం కురిపించు తల్లి" అంటూ పాటలు పాడారు. మహిళలు వారిపై నీళ్లు చల్లుతూ వర్షం కురవాలని మొక్కుకున్నారు. వర్షాలు కురిసి పంటలు పండాలని గ్రామాల్లోని హనుమాన్, పోచమ్మ ఆలయాల్లో బిందెలతో నీళ్లు పోసి, పంటలను కాపాడాలని దేవుళ్లను వేడుకుంటున్నామని రైతులు తెలిపారు.

# వెట్టి చాకిరికి విముక్తి పలుకుదాం

అంబేద్కర్ చౌరస్తాలో కళా ప్రదర్శన.....





**పోరు తెలంగాణ అక్టోబర్ 11: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా లో తెలంగాణ ప్రభుత్వం కార్మిక శాఖ మంత్రి ఆదేశాల మేరకు వెట్టి చాకిరి కి విముక్తి పలుకుదాం అనే నాటికపై కళా ప్రదర్శన ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో స్థానిక 30వ వార్డు కౌన్సిలర్ మాణిక్యరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఎంతోమంది వలస జీవితాలను అనుభవిస్తున్న కార్మికులకు ఈ యొక్క సువర్ణ అవకాశమని ఆయన అన్నారు. అదేవిధంగా వారికి ఎలాంటి సమస్యలు వచ్చినా కూడా తెలంగాణ ప్రభుత్వం కార్మిక శాఖ ప్రత్యేకమైన హెల్ప్ లైన్ ని ఏర్పాటు చేసి వాళ్ళకి సంబంధించిన శాఖలకు తగిన సూచనలు సలహాలు ఇస్తూ..08069434343 అనే నెంబర్కు కాల్ చేస్తే వెంటనే అధికారులు అప్రమత్తమై వాళ్ళ సమస్యలను పరిష్కరిస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గజవెల్లి ప్రతాప్ బృందం చే ప్రదర్శించిన కళా ప్రదర్శన ఎంతోమంది హృదయాలను ఆకట్టుకున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కళాకారుడు తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం సిర్పూర్ కాగజ్ నగర్ జిల్లా అధ్యక్షులు డోంగ్రి సంతోష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళారూపాలు ప్రదర్శిని కళాకారులు జవ్వాజి ప్రవీణ్ కుమార్, గజవెల్లి రాజశేఖర్, దూపకుంట రవి, దప్పు రంజిత తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరం పై టాస్క్‌ఫోర్స్, మంచిర్యాల టౌన్ పోలీసుల సంయుక్త దాడి..10 మంది అరెస్ట్ ,రూ.40,840 నగదు, సెల్‌ఫోన్లు ద్విచక్ర వాహనాలు స్వాధీనం




**పోరు తెలంగాణ న్యూస్// మంచిర్యాల :** మంచిర్యాల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏసీసీ కాలనీలో డబ్బులు పందెంగా పెట్టి అక్రమంగా మూడు ముక్కలాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు నార్కోటిక్ టీమ్/టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐలు దీకొండ రమేష్,లక్ష్మణ్ రావు, మంచిర్యాల టౌన్ ఎస్ఐ శ్రావణ్ మరియు సిబ్బంది సంయుక్తంగా దాడి నిర్వహించారు. ఈ దాడిలో మూడు ముక్కలాట ఆడుతున్న 10 మందిని పట్టుకుని, వారి వద్ద నుంచి పేకముక్కలు, నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న వస్తువులు:

1. పేకముక్కలు 52
2. నగదు రూ.40,840/-
3. సెల్‌ఫోన్లు 10
4. ద్విచక్ర వాహనాలు 5

పట్టుబడిన 10 మంది నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదు, పేకముక్కలు, సెల్‌ఫోన్లు,ద్విచక్ర వాహనాలతో సహా తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం మంచిర్యాల టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు.

# భయపెడుతున్న బర్నౌట్!



కార్పొరేట్ ప్రపంచాన్ని బర్నౌట్ భయపెడుతున్నది. కార్యాలయాలు, పరిశ్రమలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఇదీ ఒకటిగా మారింది. దాదాపు అన్ని రంగాల్లోని ఉద్యోగుల్లో.. ఒత్తిడి పెరిగిపోయి, ఓపిక నశించి ఆసహనంలో కూరుకుపోయి ఆవేశానికి గురవుతున్నారు. ముఖ్యంగా.. జెన్-జీ, మిలీనియల్స్‌లో బర్నౌట్ ఎక్కువగా కనిపిస్తున్నది. ఫలితంగా, ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. లక్షల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతున్నది. మొన్నటి దాకా చిన్న సమస్యగా ఉన్న బర్నౌట్.. 2025లో రికార్డు స్థాయికి చేరుకుంది. ది ఇంటర్వ్యూ గైస్ ఇటీవల ఓ పరిశోధన మేరకు.. 2025లో ప్రపంచవ్యాప్తంగా 82 శాతం మంది ఉద్యోగులు బర్నౌట్ ప్రమాదంలో ఉన్నారని తేల్చింది. దీనివల్ల ఉద్యోగుల కష్టాలతో కార్పొరేట్ సంస్థలూ నష్టాల్లోకి జారిపోతున్నాయి. ఇక బర్నౌట్‌కు కారణాలు చూస్తే.. 52 శాతం మంది ఉద్యోగుల్లో పనిభారమే ప్రధాన సమస్యగా చెప్పుకొచ్చారు. 41 శాతం మంది తమకు సరైన మద్దతు లేకపోవడమని వాపోయారు. ఇక వయసును ప్రామాణికంగా చూసుకుంటే.. సగటు ఉద్యోగి 42 ఏళ్ల వయసులో తీవ్రమైన బర్నౌట్‌కు గురవుతున్నాడు. వీరితో పోలిస్తే.. యువతరం కెరీర్‌లో చాలా ముందుగానే దీర్ఘకాలిక అలసటను ఎదుర్కొంటున్నారని అధ్యయనం బయటపెట్టింది. జెన్-జీ, మిలీనియల్ ఉద్యోగులు కేవలం 25 ఏళ్ల వయసులోనే బర్నౌట్‌ను అనుభవిస్తున్నారని తేల్చింది. ఆర్థిక ఒత్తిడి, విద్యార్థుల అప్పులు, అస్థిర ఉద్యోగ మార్కెట్లు.. ఈ పరిస్థితికి కారణమని తెలిసింది. బర్నౌట్‌లో లింగ అసమానతలు కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఎందుకంటే.. పురుషుల కంటే మహిళలే బర్నౌట్ అవుతున్నారు. పనిలో, ఇంట్లో గుర్తింపు లేకపోవడం, తక్కువ ప్రతిఫలం దక్కడం.. వీరి బర్నౌట్‌కు మూల కారణం. పెరుగుతున్న జీవన వ్యయం, అస్థిర కెరీర్ మార్గాలు కూడా బర్నౌట్‌కు దోహదం చేస్తున్నాయి. సోషల్ మీడియా.. అగ్నికి మరింత ఆజ్యం పోస్తున్నది. అది రోజువారీ ఒత్తిడి నుండి కోలుకోవడాన్ని మరింత కష్టతరం చేస్తున్నది. ఏటా 1,20,000 మరణాలకు పని ఒత్తిడి దారితీస్తున్నదని అధ్యయనకారులు చెబుతున్నారు. ఇలాంటి సమయంలో బర్నౌట్‌ను వ్యక్తిగత బలహీనతగా పరిగణించొద్దనీ, దాన్ని ప్రజారోగ్య సంక్షోభంగా పరిగణించాలని సూచిస్తున్నారు. దీనిని నివారించడానికి కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలనీ, మూల కారణాలను పరిష్కరించాలని చెబుతున్నారు.

# సీఎం పదవికి తగిన భాషేనా?



'సీఎం' అంటే ఎవరైనా చీఫ్ మినిస్టర్ అనే చెప్తారు. కొన్ని సినిమాల్లో 'కామన్ మ్యాన్' అనే నిర్వచనాన్ని కూడా ఇచ్చారు. అయితే, ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి 'సీఎం' అనే పదానికి కొత్త అర్థాన్ని సృష్టించారు, అదే 'చిల్లర మనిషి'. అవును, ఇప్పుడు తెలంగాణలో ఏ మారుమూలకు వెళ్లి అడిగినా ఆయనను అదే అంటున్నారు. ఆ మాటకొస్తే దేశం మొత్తం మీద రాజకీయ నాయకులు మొదలు సామాజిక విశ్లేషకులు సైతం అదే మాట అంటున్నారు. దీనికి కారణం ఆయన నోటి దురుసు మాత్రమే. ఈ ఘనమైన పేరును తనకు తాను తెచ్చుకోవడమే కాకుండా, దేశవ్యాప్తంగా తెలంగాణ ప్రతిష్టను మసకబారేలా చేశారు. దీనికి ఎన్నో ఉదాహరణలున్నాయి. సాధారణ సమావేశం, పబ్లిక్ మీటింగ్, ప్రెస్‌మీట్, చివరికి అసెంబ్లీలో సైతం ముఖ్యమంత్రి రేవంత్ మాటలు వివాదాస్పదం అవుతున్నాయి. చిల్లర మాటలు మాట్లాడుతూ, అడ్డగోలు బూతులు వాడుతూ సాక్షాత్తు సీఎం అనే సంగతిని మరిచి ఇష్టారీతిలో ఎవర్ని పడితే వాళ్లను, ఎంతంటే అంత మాట అంటూ పైశాచికానందాన్ని పొందుతున్నారు. అయితే, ఈ క్రమంలో వ్యక్తిగా.. తను మరింత దిగజారడమే కాదు, 125 ఏండ్ల చరిత్ర కలిగి జాతీయపార్టీ నుంచి ఓ పెద్ద ప్రాంతీయ పార్టీగా దిగజారుతున్న కాంగ్రెస్‌ను ఇంకా ఇంకా దిగజారుస్తున్నారు. 'పేగులు మెడలేసుకుంటా', 'లాగులో తొండలొదులుతా', 'లాగులూడదీసి కొడతా', 'బట్టలూడదీసి కొడతా', 'బద్మాష్ గాళ్లు', 'పందికొక్కులు' ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇంకా రాయలేని భాషలో తిట్టిన బూతులు ఎన్నో ఉన్నాయి. ఇలా రాసుకుంటూ పోతే ఈ వ్యాసం మొత్తం ఆయన బూతులతోనే నిండిపోతుంది. ఒక సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి కనీసం ఆలోచించకుండా వాడిన భాష ఇది. ఏ పదవీ లేని వ్యక్తికి, సమాజంలో బాధ్యతాయుతంగా ఉన్న వ్యక్తికీ తేడా తెలియనట్టుగా ఆయన వ్యవహరిస్తున్నారు. అధికారం కోసం, తన సొంత కార్యకర్తలను, అమాయకులను ఉచ్చులోకి లాగడానికి వాడిన భాషనే, సీఎం అయ్యాక కూడా వాడుతున్నారు. అలా వాడిన ఏకైక సీఎం కేవలం రేవంతే అయ్యుంటారు. స్వయాన విద్యాశాఖను పర్యవేక్షిస్తున్న రేవంత్ తన భాషను రాష్ట్రంలోని విద్యార్థులందరూ వింటారనే కనీస సోయి లేకుండా నడుచుకుంటున్నారు. రాష్ట్రం పరువు దేశవ్యాప్తంగా పోతుందనే బాధ ఏ మాత్రం తనకు లేకుండా రోజురోజుకు దిగజారి మాట్లాడుతుండటం రాష్ట్ర ప్రజలను విస్మయపరుస్తున్నది. అయితే, తన పరువు పోతున్నా రేవంత్ బూతు మాటలు ఎందుకు మాట్లాడుతున్నారంటే అతనిలోని నిస్పృహను ఫ్రస్ట్రేషన్‌ను సూచిస్తుందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలుచేస్తామని మొత్తంగా 420 హామీలు ఇచ్చి, బీఆర్ఎస్ నాయకులపై బూతు భాష వాడి, ప్రజలను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చారనే నిజం రేవంత్‌కు తెలుసు.

ఇప్పుడు ఆరు గ్యారెంటీల హామీలను ఎందుకు నెరవేర్చలేదనే చర్చ సమాజంలో జరగకుండా చేయాలంటే తన నోటి దురుసుతోనే సాధ్యమని రేవంత్ నమ్ముతున్నాడు. దానికి తోడు తన మంత్రివర్గ సహచరులే సీఎంగా గుర్తించకుండా చిన్నచూపు చూస్తుండటం, ఏకంగా పత్రికా ముఖంగా, లేఖల ద్వారా ఆయనను తూలనాడుతుంటే ఆ ఫ్రస్ట్రేషన్ తీర్చుకోవడానికి ఈ బూతు భాషను వాడుతున్నాడని చిన్నపిల్లాడికి సైతం అర్థమవుతున్నది. అయితే, ఇలా ఎన్నాళ్లు నెట్టుకురాగలుతాడనేది కనీస విశ్లేషణ చేసుకుంటున్నట్టుగా కనబడటం లేదు. ఇప్పటికే అధికారంలోకి వచ్చి రెండేండ్లు పూర్తయ్యాయి. 40 శాతం తన పాలనా కాలం పూర్తయినా.. చెప్పుకొనే రేంజ్‌లో, ఇదీ తన ట్రేడ్‌మార్క్ అని ప్రజలకు పనికొచ్చే పని ఒక్కటీ చేయలేదు. పై పెచ్చు హైడ్రా, భూభారతి వంటి తలతిక్క పథకాలతో ప్రజలను ప్రభుత్వమే పీల్చుకుతింటుందని ప్రజలు బహిరంగంగానే రేవంత్‌ను బండ బూతులు తిడుతున్నారు. ఇది కూడా రేవంత్ తీసుకొచ్చిన ఘనమైన మార్పే అని యావత్ దేశంలో చర్చించుకుంటున్నారు. ఇదిలా కొనసాగుతున్న తరుణంలోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు తెరమీదికి వచ్చాయి. ఆ ప్రాంత నివాసిగా, ముఖ్యంగా సినిమా ఇండస్ట్రీ వ్యక్తిగా అక్కడి ప్రజలతో నిరంతరం మమేకమయ్యే నాకు జూబ్లీహిల్స్ ప్రజలు బహిరంగంగా కైంప్లైంట్స్ చేస్తున్నదిప్రధానంగా ఈ బూతులపైనే. 'ఆయనేం మనిషండి, సీఎం స్థాయిలో ఉండి ఇంత చిల్లరగా మాట్లాడుతున్నారు' అని వాళ్లు ఆక్షేపిస్తున్నారు. సినిమా వాళ్లు కూడా సెన్సార్ ముందు వాడలేని బూతులను ఈయన ఏకంగా ప్రచారంలో వాడుతున్నాడని మండిపడుతున్నారు. తమ మనసులను చూరగొనాలంటే, పనితనంతో చేయాలి, అభివృద్ధిని అందిస్తూ, సంక్షేమాన్ని కొనసాగిస్తూ చేయాలి కానీ అవేవీ లేకుండా కేవలం చిల్లర మాటలతో రెచ్చగొట్టి ఓట్లేయించుకోవడం ఉప ఎన్నికలో ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. దీనికి తోడు అక్కడి అభ్యర్థి మాటలతో ఆగడం లేదు, తన సహజశైలిలో చేతలతో ప్రజలను బెంబేలెత్తిస్తున్నారు. ఒకవేళ ఈ చిల్లర మాటలకు, ఆ చేతలకు ఓట్లేసి గెలిపిస్తే రేపు యావత్ రాష్ట్రం, దేశం మమ్మలను చూసే చూపులను తట్టుకోలేమని చెప్తున్నారు. ఇది జూబ్లీహిల్స్‌లో స్పష్టంగా కనిపిస్తున్న తీరు. అందుకే నాయకుడనేవాడు ఆదర్శంగా ఉంటేనే ప్రజలు అనుసరిస్తారు, మెచ్చుకుంటారు. దాన్ని వదిలేసి కేవలం బూతులనే నమ్ముకుంటే వాళ్లు కూడా అదే చేసి చూపిస్తారు, కర్రు కాల్చి వాత పెట్టి రేపు రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడిస్తారు. ఇదే నవంబర్ 14న మనకు అవగతమయ్యే సత్యం. కనీసం ఇకనుంచైనా హుందాగా, తన స్థాయికి తగ్గట్టుగా మాట్లాడే మంచి గుణాన్ని మా సీఎంకు ప్రసాదించమని దేవుడిని వేడుకోవడం తప్ప మానవ మాత్రులం మనమేం చేయగలం చెప్పండి.

# రోజూ తీవ్రమైన అలసటతో ఇబ్బందులు పడుతున్నారా..?

# అయితే ఈ ఆహారాలను తినండి..!



ప్రస్తుతం చాలా మంది ఉరుకుల పరుగుల బిజీ జీవితం కారణంగా తరచూ అలసటకు గురవుతున్నారు. అలసట అనేది ప్రస్తుతం చాలా మందికి కామన్ సమస్యగా మారింది. రాత్రంతా సరిగ్గా నిద్రపోయినా, ఆహారం సమయానికి తీసుకున్నా కూడా పలు ఇతర కారణాల వల్ల కూడా చాలా మంది అలసటకు గురవుతున్నారు. నిద్రలేమి, పోషకాహార లోపం, వ్యాయామం లేదా శారీరక శ్రమ మరీ అతిగా చేయడం, ఒత్తిడి, ఆందోళన అధికంగా ఉండడం, తీవ్ర భావోద్వేగాలకు తరచూ గురి కావడం, నీటిని సరిగ్గా తాగకపోవడం వంటివి అలసట వచ్చేందుకు కారణం అవుతున్నాయి. అలాగే టీ, కాఫీలన అతిగా తాగేవారికి, మద్యం అధికంగా సేవించే వారికి కూడా అలసట వస్తుంటుంది. అలసట ఉన్నవారు శరరీంలో శక్తి లేనట్లు ఫీలవుతారు. ఉదయం నిద్రలేవగానే తీవ్రమైన అలసటగా అనిపిస్తుంది. చిన్న పనిచేసినా తీవ్రంగా నీరసం వస్తుంది. అయితే అలసట అనేది పెద్ద సమస్య కాదు. ఆయా విషయాల్లో మార్పులు చేసుకోవడంతోపాటు తినే ఆహారం విషయంలోనూ జాగ్రత్తలను పాటిస్తే అలసటను సులభంగా తగ్గించుకోవచ్చు.

### సంక్లిష్టమైన పిండి పదార్థాలు..

అలసట సమస్య ఉన్నవారు వేళకు నిద్రించే ప్రయత్నం చేయాలి. వేళకు భోజనం చేయాలి. జంక్ ఫుడ్ తీసుకోకూడదు. పోషకాలు ఉన్న ఆహారాలనే తినాలి. వ్యాయామం శరీరానికి ఎంత అవసరమో అంతే చేయాలి. శారీరక శ్రమ చేసేవారు నిరంతరాయంగా చేయకూడదు. మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవాలి. టీ, కాఫీలను అతిగా సేవించకూడదు. మద్యం తాగడం మానేయాలి. పొగ తాగకూడదు. ఒత్తిడి, ఆందోళనను తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. అందుకు గాను యోగా, ధ్యానం దోహదం చేస్తాయి. ఈ విధంగా పలు సూచనలు పాటిస్తే అలసట చాలా వరకు దూరం అవుతుంది. ఇక ఆహారం విషయంలోనూ అనేక మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా పలు ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల శరీరంలో శక్తి స్థాయిలు పెరిగి అలసట తగ్గుతుంది. అలసట ఉన్నవారు ఓట్స్, కినోవా, బ్రౌన్ రైస్‌ను తింటే ఫలితం ఉంటుంది. వీటిల్లో ఉండే సంక్లిష్టమైన పిండి పదార్థాలు రక్తంలో నెమ్మదిగా గ్లూకోజ్‌గా మారుతాయి. దీని వల్ల శరీరానికి నిరంతరం శక్తి లభిస్తూనే ఉంటుంది. దీంతో యాక్టివ్‌గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. అలసట తగ్గిపోతుంది.

### ఐరన్ ఉండే ఆహారాలు..

అలసట ఉన్నవారు చిలగడదుంపలు, ఆలుగడ్డలు, పప్పు దినుసులు, బీన్స్ వంటి ఆహారాలను తింటుంటే ఉపయోగం ఉంటుంది. చికెన్, మటన్‌ను కూడా తినవచ్చు. కోడిగుడ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాల్సి ఉంటుంది. రోజుకు ఒక కోడిగుడ్డును ఉడకబెట్టి తినాలి. కొవ్వు తీసిన పాలు, పెరుగు తీసుకోవాల్సి ఉంటుంది. నెయ్యి, పనీర్ కూడా మేలు చేస్తాయి. సోయా పాలను కూడా తాగవచ్చు. సోయా టోఫు, పీనట్ బటర్‌ను తింటున్నా ఉపయోగం ఉంటుంది. ఇక ఐరన్ లోపం వల్ల కూడా అలసట తరచూ వస్తుంది. కనుక శరీరానికి ఐరన్ లభించేలా చూసుకోవాలి. ఐరన్ ఉండే ఆహారాలను రోజూ తినాల్సి ఉంటుంది. ఐరన్ మనకు పాలకూర, మటన్, రొయ్యలు, చేపలు, పప్పు దినుసులు, గుమ్మడి విత్తనాలు, తృణ ధాన్యాల్లో లభిస్తుంది. వీటిని తినడం వల్ల ఐరన్ లభించి అలసట, నీరసం తగ్గిపోతాయి. యాక్టివ్‌గా మారుతారు.

### విటమిన్ బి12, విటమిన్ సి ఆహారాలు..

విటమిన్ సి అధికంగా ఉండే ఆహారాలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. క్యాప్సికం, సిట్రస్ ఫలాలు, స్ట్రా బెర్రీలను తింటే విటమిన్ సి లభిస్తుంది. ఇది మన శరీరాన్ని యాక్టివ్‌గా మార్చి ఉత్సాహంగా ఉండేలా చేస్తుంది. అలసటను తగ్గిస్తుంది. శరీరంలో విటమిన్ బి12 లోపం ఉన్నా కూడా నీరసంగా, అలసటగా ఉంటుంది. కనుక విటమిన్ బి12 లభించేలా చూసుకోవాలి. ఈ విటమిన్ ఎక్కువగా మటన్, చేపలు, కోడిగుడ్లు, పాల ఉత్పత్తులు, పుట్ట గొడుగుల్లో లభిస్తుంది. కనుక వీటిని తింటుంటే ఉపయోగం ఉంటుంది. అలాగే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉండే అవకాడోలు, బాదంపప్పు, వాల్ నట్స్, చియా విత్తనాలు, అవిసె గింజలను తింటుండాలి. ఇవన్నీ అలసటను తగ్గించి శరీరానికి శక్తిని అందిస్తాయి. దీంతో యాక్టివ్‌గా మారుతారు. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. నీరసం తగ్గుతుంది. ఇలా ఆయా ఆహారాలను తీసుకుంటుంటే అలసటను సులభంగా దూరం చేసుకోవచ్చు.

# కోడిగుడ్లను తినని వారు ఈ ఆహారాలను తినాలి.. ఎన్నో అద్భుతమైన లాభాలను పొందవచ్చు..

కోడిగుడ్లను తినడం వల్ల ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయో అందరికీ తెలిసిందే. కోడిగుడ్లలో మన శరీరానికి కావల్సిన దాదాపు అన్ని పోషకాలు ఉంటాయి. అత్యుత్తమ ప్రోటీన్లు, విటమిన్ డి, అనేక రకాల బి విటమిన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. అందుకనే కోడిగుడ్లను సంపూర్ణ పౌష్టికాహారంగా చెబుతారు. అయితే కోడిగుడ్లను కొందరు తినలేరు. శాకాహారం తినేవారితోపాటు అలర్జీలు ఉండేవారు కోడిగుడ్లను తినరు. దీని వల్ల అనేక పోషకాలను కోల్పోయిన భావన కలుగుతుంది. అయితే కోడిగుడ్లను తినకపోయినా ఫర్వాలేదు, ఎందుకంటే అచ్చం గుడ్లలో ఉండే లాంటి పోషకాలు ఇతర శాకాహారాల్లోనూ ఉంటాయి. వాటిని తినడం వల్ల కూడా కోడిగుడ్లను తిన్న లాంటి పోషకాలను పొందవచ్చు. ఆయా ఆహారాలను కోడిగుడ్లకు చక్కని ప్రత్యామ్నాయంగా చెప్పవచ్చు. అందువల్ల వాటిని తింటే కోడిగుడ్ల మాదిరిగా ఎన్నో పోషకాలను పొందవచ్చు. సోయా టోఫు, పెరుగు.. సోయా టోఫును కోడిగుడ్లకు చక్కని ప్రత్యామ్నాయంగా చెప్పవచ్చు. ఇందులో అత్యుత్తమ స్థాయి వృక్ష సంబంధ ప్రోటీన్లు ఉంటాయి. మన శరీరానికి కావల్సిన 9 ముఖ్యమైన అమైనో ఆమ్లాలు మనకు సోయా టోఫు ద్వారా లభిస్తాయి. అలాగే ఐరన్, క్యాల్షియం, మాంగనీస్ కూడా అధిక మొత్తంలో లభిస్తాయి. సోయా టోఫును తినడం వల్ల కండరాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. కొలెస్ట్రాల్ అసలే ఉండదు. కనుక బరువు తగ్గడం తేలికవుతుంది. ఇందులో ఉండే ఐసో ఫ్లేవోన్స్ ఎముకలను, గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. అలాగే పెరుగును కూడా కోడిగుడ్లకు ప్రత్యామ్నాయంగా చెప్పవచ్చు.



ఇందులో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. క్యాల్షియంను అధికంగా పొందవచ్చు. పెరుగును అత్యుత్తమ ప్రొ బయోటిక్ ఆహారంగా చెబుతారు. దీన్ని రోజూ తింటుంటే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణ శక్తి పెరుగుతుంది. క్యాల్షియం వల్ల ఎముకలు, దంతాలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి.

### పప్పు దినుసులు, కినోవా..

పప్పు దినుసులు, బీన్స్‌ను కూడా కోడిగుడ్లకు చక్కని ప్రత్యామ్నాయ ఆహారంగా పేర్కొనవచ్చు. వీటిల్లో ఫైబర్ అధిక మొత్తంలో ఉంటుంది. ప్రోటీన్లు సైతం అధికంగా లభిస్తాయి. ఐరన్, ఫోలేట్ వంటి పోషకాలను కూడా పొందవచ్చు. వీటిని తినడం వల్ల జీర్ణ శక్తి మెరుగు పడుతుంది. షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయి. ఫోలేట్ వల్ల గర్భస్థ శిశువుకు మేలు జరుగుతుంది. గర్భిణీలు ఆరోగ్యంగా ఉంటారు. అలాగే కోడిగుడ్లను తినలేని వారు కినోవాను తీసుకోవచ్చు. ఇందులోనూ ప్రోటీన్లు అధిక మొత్తంలో ఉంటాయి. అలాగే ఫైబర్, మెగ్నిషియం, ఐరన్ వంటి పోషకాలను సైతం పొందవచ్చు. కినోవాను తింటే శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. చురుగ్గా ఉంటారు. ఉత్సాహంగా పనిచేస్తారు. బద్దకం పోతుంది. నీరసం, అలసట తగ్గుతాయి. శరీరానికి కావల్సిన శక్తి లభిస్తుంది. కినోవాలో ఉండే మెగ్నిషియం కారణంగా కండరాలు ప్రశాంతంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. కండరాల నొప్పులు తగ్గుతాయి. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

### పనీర్, అవిసె గింజలు..

కోడిగుడ్లను తినని వారికి పనీర్ కూడా చక్కని ఆహారం అని చెప్పవచ్చు. దీన్ని తింటున్నా కూడా హై క్వాలిటీ ప్రోటీన్లు లభిస్తాయి. అలాగే క్యాల్షియం, విటమిన్ బి12 వంటి పోషకాలను సైతం పొందవచ్చు. పనీర్‌ను తినడం వల్ల శరీరానికి శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. చురుగ్గా పనిచేస్తారు. బరువును నియంత్రణలో ఉంచుకోవచ్చు. కండరాలకు మరమ్మత్తులు జరుగుతాయి. కండరాలు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే అవిసె గింజలను తింటున్న కూడా ఉపయోగం ఉంటుంది. వీటిని కూడా కోడిగుడ్లకు ప్రత్యామ్నాయ ఆహారంగా చెప్పవచ్చు. వీటిల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి మెదడును, గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. శరీరానికి కావల్సిన ఫైబర్‌ను అందిస్తాయి. దీని వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

# మీ దగ్గర లక్ష రూపాయలు ఉన్నాయా? 6 బెస్ట్ బిజినెస్‌లు లక్షల్లో లాభం..!



గ్రామాలలో స్థానిక అవసరాలు, సహజ వనరులు, తక్కువ నిర్వహణ ఖర్చులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా మంచి ఆదాయం సంపాదించడం సాధ్యమే. పశుపోషణ నుండి ఆహార ఉత్పత్తుల ఉత్పత్తి, అమ్మకం వరకు గ్రామాలలో ప్రారంభించగల అనేక చిన్న వ్యాపారాలు ఉన్నాయి..

గ్రామాలలో నివసించే ప్రజలకు తక్కువ పెట్టుబడితో సొంత వ్యాపారాలు ప్రారంభించి, స్థిరమైన ఆదాయం సంపాదించడానికి అనేక అవకాశాలు ఉన్నాయి. చాలా మంది ఉపాధి కోసం నగరాలకు వలస వెళతారు. అయితే గ్రామాలలో స్థానిక అవసరాలు, సహజ వనరులు, తక్కువ నిర్వహణ ఖర్చులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా మంచి ఆదాయం సంపాదించడం సాధ్యమే. పశుపోషణ నుండి ఆహార ఉత్పత్తుల ఉత్పత్తి, అమ్మకం వరకు గ్రామాలలో ప్రారంభించగల అనేక చిన్న వ్యాపారాలు ఉన్నాయి. ఈ వ్యాపారాల ద్వారా లక్షల్లో లాభం పొందవచ్చుంటున్నారు నిపుణులు.

1 / 5

గ్రామాలలో ప్రారంభించగల ముఖ్యమైన వ్యాపారాలలో పాడి పరిశ్రమ ఒకటి. రెండు నుండి నాలుగు ఆవులు లేదా గేదెలను పెంచడం ద్వారా ఈ వ్యాపారాన్ని చిన్న స్థాయిలో ప్రారంభించవచ్చు. పాలు అమ్మడం ద్వారా మీరు రోజువారీ ఆదాయం సంపాదించవచ్చు. పెరుగు, పనీర్, నెయ్యి వంటి ఉత్పత్తులను తయారు చేసి అమ్మడం ద్వారా కూడా మీరు మీ ఆదాయ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. సమీప ప్రాంతాలలోని ఇళ్లకు, దుకాణాలకు, హోటళ్లకు ఉత్పత్తులను సరఫరా చేయడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే పశుగ్రాసం, నిర్వహణ, చికిత్స వంటి ఖర్చులను లెక్కించిన తర్వాతే లాభాన్ని అంచనా వేయాలి.

2 / 5

గొర్రెల పెంపకం అనేది సాపేక్షంగా చిన్న స్థాయిలో ప్రారంభించగల మరో వ్యాపారం. మీరు 10 నుండి 15 గొర్రెలను పెంచడం ద్వారా ఈ రంగాన్ని ప్రారంభించవచ్చు. గొర్రెపిల్లలు, పాలు, మాంసం అమ్మకం ద్వారా మీరు ఆదాయం సంపాదించవచ్చు. స్థానిక మార్కెట్‌లోని డిమాండ్, ఉత్పత్తుల ధరను బట్టి లాభాలు మారుతూ ఉంటాయి. ఈ వ్యాపారంలో సరైన సంరక్షణ, టీకాలు వేయించడం, మేత లభ్యతను నిర్ధారించడం చాలా ముఖ్యం.

3 / 5

గుడ్లు, మాంసానికి ఉన్న డిమాండ్‌ను సద్వినియోగం చేసుకొని మీరు కోళ్ల పెంపకం వ్యాపారాన్ని ప్రారంభించవచ్చు. మీరు 200 నుండి 500 కోళ్లతో ఈ వ్యాపారాన్ని మొదలుపెట్టవచ్చు. మార్కెట్ డిమాండ్‌ను బట్టి కోళ్ల సంఖ్యను పెంచుకోవచ్చు. సమీపంలోని దుకాణాలు, హోటళ్లు, ఇళ్లతో అమ్మకాల సంబంధాలను ఏర్పరచుకోవడం సహాయకరంగా ఉంటుంది. కోడిపిల్లల ఖర్చు, మేత ఖర్చులు, టీకాల ఖర్చులు, కూలీల ఖర్చులను ఖచ్చితంగా లెక్కించాలి. సరిగ్గా చేస్తే, మీరు గుడ్లు, మాంసం ద్వారా ఆదాయం సంపాదించవచ్చు.

4 / 5

గ్రామాలలో పిండి మిల్లుకు స్థిరమైన డిమాండ్ ఉంటుంది. గోధుమలు, ఇతర ధాన్యాలను పిండి చేసే సేవను ప్రారంభించడానికి మీరు సుమారు రూ. 40,000 నుండి రూ. 60,000 వరకు ఖరీదు చేసే యంత్రాలను పరిగణించవచ్చు. యంత్రం సామర్థ్యం, బ్రాండ్, ప్రదేశాన్ని బట్టి ఖర్చు మారుతుంది. మసాలా దినుసులను పిండి చేసే సేవను ప్రారంభించడం కూడా ఎక్కువ మంది వినియోగదారులను ఆకర్షించగలదు. రోజువారీ ఆదాయం వినియోగదారుల సంఖ్య, పిండి చేసే పరిమాణం, విద్యుత్ ఖర్చులు, నిర్వహణ వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది.

# ఫ్రిజ్, ఏసీలో ఈ చిన్న సెట్టింగ్స్‌తో కరెంట్ బిల్లును సగానికి సగం తగ్గించుకోండి ఈ సింపుల్ ట్రిక్స్ మీకోసమే




కరెంట్ బిల్లు తగ్గించుకోవడానికి వేలకు వేలు పోసి 5 స్టార్ ఏసీలు, ఫ్రిజ్‌లు కొంటున్నారా? అయితే ఈ నిజం తెలుసుకోవాల్సిందే.. ఎంత ఖరీదైన ఉపకరణాలు ఉన్నా, వాటిని నడిపే సెట్టింగ్స్ సరిగ్గా లేకపోతే నెలాఖరుకు బిల్లు షాక్ కొట్టడం ఖాయం. అక్టోబర్ నెలలో వచ్చే ఉక్కపోతకు ఏసీ, ఫ్రిజ్ వాడుతూనే కరెంట్ బిల్లును సగానికి తగ్గించుకోవడానికి నిపుణులు చెబుతున్న సీక్రెట్ టిప్స్ గురించి తెలుసుకోండి.. అక్టోబర్ నెలలోనూ ఎండలు మండుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేడి, ఉక్కపోతతో చాలా ఇళ్లలో ఏసీలు, ఫ్రిజ్‌ల వినియోగం నిరంతరాయంగా సాగుతుంది. అయితే నెలాఖరుకు వచ్చే విద్యుత్ బిల్లులను చూసి చాలామంది ఆందోళన చెందుతుంటారు. 5 స్టార్ రేటింగ్ ఉన్న పరికరాలు ఉన్నప్పటికీ విద్యుత్ వినియోగం తగ్గకపోవడానికి ప్రధాన కారణం వాటిని నడిపే సెట్టింగులేనని నిపుణులు చెబుతున్నారు. ఖరీదైన ఉపకరణాలు కొనడం మాత్రమే కాకుండా వాటి సరైన నిర్వహణే బిల్లులను తగ్గిస్తుంది. విద్యుత్ ఆదా కోసం నిపుణులు సూచిస్తున్న కీలక అంశాల గురించి తెలుసుకోవడం ముఖ్యం.

ఏసీని ఈ నంబర్ వద్ద ఉంచండి

ఉక్కపోత నుంచి వెంటనే ఉపశమనం కోసం చాలామంది ఏసీని ఆన్ చేయగానే 18 లేదా 20 డిగ్రీలకు సెట్ చేస్తారు. అయితే ఉష్ణోగ్రత తక్కువ పెట్టినంత మాత్రాన గది త్వరగా చల్లబడదు. ఏసీ తన నిర్ణీత వేగంతోనే పనిచేస్తుంది. పైగా కంప్రెసర్ ఎక్కువ సమయం పనిచేయాల్సి రావడంతో విద్యుత్ ఖర్చు విపరీతంగా పెరుగుతుంది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ మార్గదర్శకాల ప్రకారం.. ఏసీని 24 డిగ్రీల వద్ద ఉంచడం అత్యంత అనుకూలం. టెంపరేచర్‌ను ఒక్క డిగ్రీ పెంచడం ద్వారా దాదాపు 6శాతం వరకు విద్యుత్‌ను ఆదా చేయవచ్చు. అక్టోబర్ రాత్రుల్లో వాతావరణం చల్లబడుతుంది కాబట్టి స్లీప్ లేదా ఎకో మోడ్ వాడితే అది ఆటోమేటిక్‌గా కూలింగ్‌ను సర్దుబాటు చేసి కరెంట్ ఆదా చేస్తుంది.

ఫ్రిజ్ ఉష్ణోగ్రత తప్పుడు సెట్టింగ్స్‌తో నష్టం

రిఫ్రిజిరేటర్ రోజుకు 24 గంటలూ నడుస్తుంది కాబట్టి దాని థర్మోస్టాట్ సెట్టింగ్ చాలా ముఖ్యం. ఫ్రిజ్ లోపలి సాధారణ భాగంలో 3 నుండి 5 డిగ్రీలు, డీప్ ఫ్రీజర్‌లో -18 డిగ్రీల వద్ద ఉంచడం సరైన ప్రమాణం. ఫ్రిజ్ తలుపును పదేపదే తీయడం వల్ల లోపలి చల్లటి గాలి బయటకు పోయి కంప్రెసర్‌పై భారం పడుతుంది. అలాగే వేడి ఆహారాన్ని నేరుగా కాకుండా చల్లారిన తర్వాతే లోపల పెట్టాలి. ఫ్రిజ్‌ను గోడకు బాగా ఆనించి పెట్టకుండా వెనుక భాగంలో గాలి ఆడేలా కాస్త స్థలం వదిలితే కూలింగ్ సిస్టమ్ సమర్థవంతంగా పనిచేస్తుంది.

# రైతులకు దసరా కానుక? ఒకేసారి బ్యాంకు ఖాతాలో రూ.6 వేలు..!



దసరా సమయంలో రైతులకు ఆర్థిక సాయం అందే అవకాశం ఉందన్న వార్తలు వెలువడుతున్నప్పటికీ, నిధుల విడుదల తేదీపై అధికారిక ప్రకటన కోసం వేచి చూడాలి. రైతులు తమ ఈ-కేవైసీ, బ్యాంకు వివరాలు, రైతు రిజిస్ట్రీని ముందుగానే సరిచూసుకోవడం మంచిది.. ఏపీలోని రైతులకు పండుగ వేళ ఆర్థిక సాయం అందే అవకాశంపై చర్చ జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం తదుపరి విడతతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ సాయం కూడా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కావచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నిధుల విడుదలపై రైతులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**పీఎం కిసాన్ ద్వారా ఎంత సాయం అందుతుంది?**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద అర్హులైన రైతు కుటుంబాలకు ఏడాదికి రూ.6,000 ఆర్థిక సాయం అందుతుంది. ఈ మొత్తాన్ని మూడు విడతలుగా ఒక్కోసారి రూ.2,000 చొప్పున నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. 2026 జూన్‌లో 23వ విడత నిధులు విడుదలైన నేపథ్యంలో తదుపరి 24వ విడత కోసం రైతులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. అక్టోబర్ 17 లేదా 18 తేదీల్లో నిధులు విడుదల కావచ్చని కొన్ని వార్తా కథనాలు పేర్కొంటున్నాయి. అయితే, అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ తేదీలను ఖరారైనవిగా భావించకూడదు.

**అన్నదాత సుఖీభవ పథకం కింద ఎంత వస్తుంది?**

ఏపీ సర్కార్ రైతుల కోసం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ--పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హులైన రైతు కుటుంబాలకు ఏడాదికి మొత్తం రూ.20,000 ఆర్థిక సాయం అందించాలనేది పథకం లక్ష్యం. ఇందులో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6,000తో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.14,000 ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, అర్హులైన భూమి యజమాని రైతు కుటుంబాలు, నిర్దిష్ట అర్హతలున్న సాగుదారులకు ఈ పథకం వర్తిస్తుంది. భూమిలేని కౌలు రైతులకు కూడా నిర్దేశించిన నిబంధనల ప్రకారం రాష్ట్ర నిధుల నుంచి సాయం అందించే అవకాశం ఉంది.

**ఒకేసారి రూ.6,000 వస్తాయా?**

పీఎం కిసాన్ కింద రూ.2,000, అన్నదాత సుఖీభవ రాష్ట్ర వాటా కింద రూ.4,000 కలిపి అర్హులైన కొంతమంది రైతులకు ఒక విడతలో మొత్తం రూ.6,000 అందవచ్చని వార్తా కథనాలు సూచిస్తున్నాయి. అయితే రైతులందరికీ ఒకే తేదీన ఈ మొత్తం జమ అవుతుందని ఇప్పుడే చెప్పలేం. అర్హత, విడతల షెడ్యూల్, ప్రభుత్వ అధికారిక ప్రకటన ఆధారంగా చెల్లింపులు నిర్ధారించవచ్చు.

**రైతులు తప్పనిసరిగా చేయాల్సిన పనులు**

నిధులు అందడంలో ఆలస్యం కాకుండా రైతులు ఈ అంశాలను పరిశీలించాలి:

పీఎం కిసాన్ పథకానికి సంబంధించిన ఈ-కేవైసీ పూర్తి అయిందో లేదో చూసుకోవాలి. అలాగే బ్యాంకు ఖాతా వివరాలు సరిగ్గా ఉన్నాయో నిర్ధారించుకోవాలి. ఆధార్ అనుసంధానం, బ్యాంకు ఖాతా ద్వారా చెల్లింపులకు సంబంధించిన వివరాలను తనిఖీ చేయాలి. అవసరమైన చోట రైతు రిజిస్ట్రీ నమోదు, భూమి వివరాల ధ్రువీకరణ పూర్తి చేయాలి. ఏపీలో పీఎం కిసాన్ లబ్ధిదారుల్లో కొందరి రైతు రిజిస్ట్రీ నమోదు ఇంకా పూర్తికాలేదని సెప్టెంబర్ 2026లో వచ్చిన నివేదికలు పేర్కొన్నాయి. రైతులు తమ వివరాలను సంబంధిత వ్యవసాయ అధికారుల వద్ద ధ్రువీకరించుకోవడం మంచిది.

**డబ్బులు జమయ్యాయో లేదో ఎలా తెలుసుకోవాలి?**

పీఎం కిసాన్ అధికారిక వెబ్‌సైట్‌లో లబ్ధిదారుల వివరాలు, విడత చెల్లింపు స్థితిని తనిఖీ చేయవచ్చు. అధికారిక వెబ్‌సైట్: ≀పీ-ఖ×ూాచీ అన్నదాత సుఖీభవకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం లేదా వ్యవసాయ శాఖ ప్రకటించే అధికారిక సమాచారాన్ని పరిశీలించాలి. దసరా సమయంలో రైతులకు ఆర్థిక సాయం అందే అవకాశం ఉందన్న వార్తలు వెలువడుతున్నప్పటికీ, నిధుల విడుదల తేదీపై అధికారిక ప్రకటన కోసం వేచి చూడాలి. రైతులు తమ ఈ-కేవైసీ, బ్యాంకు వివరాలు, రైతు రిజిస్ట్రీని ముందుగానే సరిచూసుకోవడం మంచిది.

# ఒక ట్రక్కు 500 కిలోమీటర్లకు ఎంత డీజిల్ వినియోగిస్తుంది? పూర్తి లెక్కలివే..!

వాహనానికి సకాలంలో సర్వీసింగ్ చేయించకపోవడం, పాత ఇంజన్, లేదా టైర్లలో గాలి తక్కువగా ఉండటం వంటి కారణాల వల్ల కూడా ట్రక్కు ఎక్కువ డీజిల్‌ను వినియోగిస్తుంది. అందువల్ల ఈ అధిక ఇంధన వృధాను నివారించడానికి డ్రైవర్లు ఎల్లప్పుడూ.. మనం రోడ్డు మీద ప్రయాణిస్తున్నప్పుడల్లా ట్రక్కులు కదులుతూ కనిపిస్తాయి. ఎందుకంటే ట్రక్కులు దేశంలోని నలుమూలలకూ నిత్యావసర వస్తువులను రవాణా చేస్తాయి. మనకు ట్రక్కు కనిపించినప్పుడల్లా ఒక ప్రశ్న అనివార్యంగా తలెత్తుతుంది. నిరంతరం రోడ్డు మీద తిరిగే ఈ ట్రక్కులు ఎంత ఇంధనాన్ని వినియోగిస్తాయి? భారతదేశంలోని చాలా ట్రక్కులు డీజిల్‌తో నడుస్తాయి. డీజిల్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఫలితంగా రవాణా సంస్థలు, డ్రైవర్లు ఎల్లప్పుడూ తమ వాహనం మైలేజీపై నిశితంగా దృష్టి సారిస్తారు. చిన్న ట్రక్కు నుండి భారీ ట్రైలర్ వరకు డీజిల్ వినియోగం చాలా తేడాగా ఉంటుందని చెబుతున్నారు టెక్ నిపుణులు. ఒక ట్రక్కు 500 కిలోమీటర్లు ప్రయాణించడానికి ఎంత డీజిల్ వినియోగిస్తుంది ? అలాగే దానికి ఎంత ఖర్చు అవుతుందో తెలుసుకుందాం. చిన్న ట్రక్కుల నుండి పెద్ద ట్రక్కుల వరకు డీజిల్ వినియోగం, ఖర్చుల పూర్తి వివరాలను మీకు అందిస్తాము.



**చిన్న ట్రక్కు ఖర్చు**

నగరంలోపల సరుకు రవాణా కోసం టాటా 407 వంటి తేలికపాటి, మధ్య తరహా వాణిజ్య వాహనాలను లేదా ఐషర్ వంటి చిన్న ట్రక్కులను సాధారణంగా ఉపయోగిస్తారని గమనించాలి. ఈ తేలికపాటి ట్రక్కులు, వాటి లోడింగ్ సామర్థ్యాన్ని బట్టి, సాధారణంగా లీటరుకు సుమారు 7 నుండి 9 కిలోమీటర్ల డీజిల్ ఇంధన మైలేజీని అందిస్తాయి. అటువంటి ట్రక్కు 500 కిలోమీటర్ల దూరం నిరంతరాయంగా ప్రయాణిస్తే, అది సుమారుగా 55 నుండి 70 లీటర్ల డీజిల్‌ను వినియోగిస్తుంది. నేటి మార్కెట్‌లో డీజిల్ సగటు ధర లీటరుకు రూ.90గా పరిగణిస్తే, ఈ మొత్తం ప్రయాణానికి అయ్యే ఖర్చు సుమారుగా రూ.5,000 నుండి రూ.6,300 వరకు ఉంటుందని చెబుతున్నారు.

**భారీ ట్రక్కు అకౌంటింగ్**

పెద్ద, బరువైన వాణిజ్య ట్రక్కుల విషయానికి వస్తే, డీజిల్ వినియోగం గణనీయంగా పెరుగుతుంది. ఎందుకంటే పది చక్రాల, పన్నెండు చక్రాల ట్రక్కుల వంటి భారీ ట్రక్కులు పూర్తిగా లోడ్ అయినప్పుడు వాటి మైలేజీ లీటరుకు సుమారుగా 4.5 నుండి 6 కిలోమీటర్లకు పడిపోతుంది. అందువల్ల ఈ భారీ ట్రక్కులు 500 కిలోమీటర్లు ప్రయాణిస్తే వాటి ట్యాంకు నుండి సుమారుగా 85 నుండి 110 లీటర్ల డీజిల్ అవసరం అవుతుంది. డీజిల్ ధరల ఆధారంగా లెక్కిస్తే ఈ వాహనాలు కేవలం 500 కిలోమీటర్ల ప్రయాణానికి సుమారుగా 7,600 నుండి 10,000 రూపాయల ఇంధనాన్ని వినియోగిస్తాయి. వాటి భారీ బరువులు, పెద్ద ఇంజన్ల కారణంగా ఈ ట్రక్కుల నిర్వహణ ఖర్చులు గణనీయంగా ఎక్కువగా ఉంటాయి.

**భారీ ట్రక్కులు**

ఇప్పుడు రోడ్డుపై ఉన్న అతిపెద్ద, అత్యంత బరువైన మల్టీ-యాక్సిల్ ట్రక్కుల గురించి మాట్లాడుకుందాం. ఇవి ఒకేసారి 30 నుండి 40 టన్నుల భారీ బరువును మోయగలవు. అవి లాగవలసిన భారీ బరువుల కారణంగా ఈ ట్రక్కులు లీటరుకు కేవలం 3 నుండి 4 కిలోమీటర్ల మైలేజీని మాత్రమే సాధిస్తాయి. ఇంత పెద్ద ట్రక్కులు 500 కిలోమీటర్లు ప్రయాణించినప్పుడు అవి సుమారుగా 125 నుండి 165 లీటర్ల డీజిల్‌ను వినియోగిస్తాయి. వాటి మొత్తం ఇంధన వినియోగాన్ని, లీటరుకు రూ.90 చొప్పున లెక్కిస్తే ఈ ప్రయాణానికి అయ్యే మొత్తం డీజిల్ వినియోగం సుమారుగా రూ.11,200 నుండి రూ.15,000 వరకు చేరుతుంది.

**ఖర్చు ఎందుకు ఇంతగా పెరుగుతుంది?**

ఇప్పుడు ట్రక్కులు నడవడానికి ఎందుకు అంత డీజిల్ అవసరమవుతుందో తెలుసుకుందాం. దీనికి ప్రధాన కారణం ట్రక్కు బరువు. సరుకు ఎంత ఎక్కువగా లోడ్ చేస్తే, ఇంజిన్‌పై అంత ఎక్కువ భారం పడుతుంది. ఫలితంగా ఇంధన వినియోగం తగ్గుతుంది. అంతేకాకుండా కొండ ప్రాంతాలు, సరిగా లేని రోడ్లు, నగరాల్లో ఉండే అధిక ట్రాఫిక్ వంటి రహదారి పరిస్థితులు కూడా డీజిల్ వినియోగం విపరీతంగా పెరగడానికి దోహదం చేస్తాయి. అంతేకాకుండా వాహనానికి సకాలంలో సర్వీసింగ్ చేయించకపోవడం, పాత ఇంజన్, లేదా టైర్లలో గాలి తక్కువగా ఉండటం వంటి కారణాల వల్ల కూడా ట్రక్కు ఎక్కువ డీజిల్‌ను వినియోగిస్తుంది. అందువల్ల ఈ అధిక ఇంధన వృధాను నివారించడానికి డ్రైవర్లు ఎల్లప్పుడూ సరిగ్గా వాహనం నడపాలని సూచిస్తుంటారు నిపుణులు.

# బంగారం ధర రూ.3 లక్షలకు చేరుకుంటుందా? ప్రకంపనలు సృష్టిస్తున్న బాబా వంగా అంచనాలు!



బ్యాంకుల కొనుగోళ్లు, ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు, రిజర్వుల వైవిధ్యీకరణ, రూపాయి విలువ పడిపోతుందనే భయాల కారణంగా బంగారానికి మద్దతు లభిస్తోందని నిపుణుడు అజయ్ కేడియా అన్నారు. 2027 సంవత్సరంలో బంగారం ధరల పెరుగుదల గురించి ఆయన అంచనా వేస్తూ, బంగారం..

సంవత్సరం ప్రారంభంలో బంగారం ధర సర్వకాలీన గరిష్ఠ స్థాయిలో ఉండగా, ఇప్పుడు అది బాగా తగ్గింది. జనవరి 29, 2026న, 10 గ్రాముల బంగారం ధర సర్వకాలీన గరిష్ఠ స్థాయి అయిన రూ. 1.93 లక్షల నుండి రూ. 1.50 లక్షలకు తగ్గింది. ఇదిలా ఉండగా, బాబా వంగాగా ప్రసిద్ధి చెందిన బల్గేరియాకు చెందిన వాంగేలియా పాండేవా గుష్టెరోవా బంగారం గురించి చేసిన అంచనాలు వార్తల్లో నిలిచాయి.

1 / 8

తీవ్రమైన ఆర్థిక సంక్షోభం కారణంగా 2027 సంవత్సరంలో బంగారం ధర తులంకు రూ. 2.80 లక్షలకు చేరుకుంటుందని బాబా వెంగా జోస్యం చెప్పారని ఇందులో పేర్కొన్నారు. ఇది విన్న తర్వాత, ఇప్పటికే బంగారం కొనుగోలు చేసిన వారు ఊపిరి పీల్చుకున్నారు. కానీ పెట్టుబడి పెట్టాలని లేదా పెళ్లి కోసం కొనాలని ఆలోచిస్తున్న వారు ఆందోళనకు గురయ్యారు. ఇలాంటి సమయాల్లో ఎగుమతిదారుల నుండి బంగారు మార్కెట్‌లోని పోకడలను, బంగారం ధరను ప్రభావితం చేసే కారకాలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. అయితే, అంతకంటే ముందు, బులియన్ మార్కెట్‌లో కలకలం పెంచిన బాబా వెంగా జోస్యం గురించి తెలుసుకుందాం.

2 / 8

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత బంగారం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఆధారం అవుతుందని బాబా వెంగా చెప్పారు. 2027వ సంవత్సరంలో బంగారం ధరలు సర్వకాలీన గరిష్ఠ స్థాయికి చేరుకుంటాయని కూడా బాబా వెంగా అంచనా వేశారు. 2027వ సంవత్సరంలో ప్రపంచ ఆర్థిక సంక్షోభం సంభవించవచ్చని ఆయన అన్నారు. దీని కారణంగా బంగారం ధర వేగంగా పెరిగి, తులంకు రూ. 2.62 నుంచి 2.82 లక్షల వరకు దాటవచ్చని ఆయన తెలిపారు. ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే బంగారం సర్వకాలీన గరిష్ఠ స్థాయికి చేరడానికి కారణం ఏమిటి?

3 / 8

బంగారం ధరల పెరుగుదల వెనుక మూడు ప్రధాన కారణాలు ఉన్నాయని కమోడిటీ నిపుణుడు అజయ్ కేడియా అన్నారు. అతిపెద్ద కారణం భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తత. రెండవ కారణం, సెంట్రల్ బ్యాంక్ నిరంతరం బంగారాన్ని కొనుగోలు చేస్తుండటం. ఇది కాకుండా, భారతదేశం మరియు చైనా నుండి కూడా డిమాండ్ కొనసాగుతోంది.

4 / 8

బాబా వెంగాకు ఆపాదించినన ఈ వాదనలకు సంబంధించి ఎలాంటి లిఖితపూర్వక ఆధారం లేదు. కానీ గత ఏడాదిన్నర కాలంలో చోటుచేసుకున్న హెచ్చుతగ్గులు చాలా విషయాలు తెలియజేస్తున్నాయి. 2026లో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధి మూసివేత కారణంగా ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రపంచ ఇంధన సంక్షోభం ఏర్పడింది, స్టాక్ మార్కెట్ భారీగా కుప్పకూలింది.

5 / 8

అదే కాలంలో జనవరిలో బంగారం ధరలు ఆకాశాన్ని అంటడం ప్రారంభించాయి. ప్రజలు బంగారంలో పెట్టుబడులు పెట్టడం మొదలుపెట్టారు. 2025 సంవత్సరం ప్రారంభంలో 10 గ్రాముల బంగారం ధర రూ. 76,179 ఉండగా, మార్చి 7 నాటికి అది 10 గ్రాములకు రూ. 85,966కు చేరుకుంది. బంగారం ధరలో ఇదే మొదటి పెద్ద పెరుగుదల. దీని ఆధారంగా, ఊహాగానాలు పెరిగాయి. కొనుగోళ్లు అధికమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా దేశాలు తమ బంగారు నిల్వలను పెంచుకోవడం ప్రారంభించాయి. ఇది బంగారం ధరలలో చారిత్రాత్మక పెరుగుదలకు దారితీసింది.

6 / 8

గత సంవత్సరం ఏప్రిల్ నుండి బంగారం ధరలు గణనీయంగా పెరిగాయి. 2025 ఏప్రిల్ 21న, 10 గ్రాముల బంగారం ధర రూ.99,800గా ఉంది. ఆ తర్వాత 2025 డిసెంబర్ 31న అది 10 గ్రాములకు రూ.1,33,195కి పెరిగింది. ఈ సంవత్సరం, 2026 జనవరి 29న, బంగారం ధర 10 గ్రాములకు రూ.1,75,340 గరిష్ట స్థాయికి చేరుకుంది. 2026 అక్టోబర్ 8న 10 గ్రాముల బంగారం ధర రూ.1,47,463గా నమోదైంది.

7 / 8

రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత స్తంభింపజేసిన ఆస్తులు కూడా బంగారం ధరల పెరుగుదలకు ఒక పెద్ద కారణమని అజయ్ కేడియా అన్నారు. సుమారు 2-3 సంవత్సరాలుగా ఈ ప్రేరకాలు అమలులో ఉండటం వల్ల, బంగారం ధర రూ.1.80 లక్షల స్థాయికి చేరుకోవడాన్ని మనం చూస్తున్నాం. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రకారం నేడు భారతదేశంలోని సామాన్య ప్రజల వద్ద 22 వేల టన్నుల బంగారం ఉంది. అందిన సమాచారం ప్రకారం, ప్రభుత్వ బంగారు నిల్వలో 841 టన్నుల బంగారం ఉంది. 13 దేవాలయాల వద్ద 3 నుంచి 4 టన్నుల బంగారం ఉంది. ఈ 13 దేవాలయాలలోని బంగారం, బిలియనీర్లందరి సంపద కంటే ఎక్కువ.